మంగళవారం
7-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 107
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కెనడా ప్రధాని ట్రుడో రాజీనామా

ఒట్టావా: కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. లిబరల్ పార్టీ అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు తన నిర్ణయాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించారు. పార్లమెంటు కొత్త సమావేశానికి పిలుపునివ్వాల్సిందిగా కెనడా గవర్నర్ జనరల్‌కు సూచించానని ట్రుడో విలేకరులకు తెలిపారు. 2015 నుండి ప్రధానమంత్రిగా పనిచేసిన ట్రుడోపై దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అదే సమయంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లిబరల్ పార్టీ గెలుపు అవకాశాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో ట్రుడో ప్రధాని పదవితో పాటు పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలగబోతున్నట్లు అంతర్జాతీయ మీడియాలో ముందుగానే కథనాలొచ్చాయి.

హెచ్‌ఎంపీవీ కలకలం

భారత్‌లో మూడు కేసుల నిర్ధారణ
ఆందోళన వద్దన్న కేంద్ర ఆరోగ్య శాఖ



న్యూఢిల్లీ: చైనాలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) విజృంభిస్తున్న వేళ... భారత్‌లోనూ ఆ వైరస్‌ను గుర్తించారు. కర్నాటక రాష్ట్రంలో రెండు కేసులు వెలుగు చూసినట్లు ఐసీఎంఆర్ వెల్లడించగా, గుజరాత్‌లో ఒక అనుమానిత కేసు నమోదైంది. బెంగళూరులో మూడు, ఎనిమిది నెలల వయసున్న ఇద్దరు చిన్నారులకు హెచ్‌ఎంపీవీ నిర్ధారణ కాగా... అహ్మదాబాద్‌లో రెండు నెలల చిన్నారి ఇదే వైరస్ లక్షణాలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. 'దేశవ్యాప్తంగా ఐసీఎంఆర్ సాధారణ పర్యవేక్షణలో భాగంగా రెండు శ్వాసకోశ వ్యాధులు వెలుగు చూశాయి' అని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఈ వైరస్ వ్యాపిస్తోందని, దానికి సంబంధించిన

- మిగతా 2 లో

రూ.12 లక్షల కోట్లు ఆవిరి

ముంచిన వైరస్ భయాలు

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో మరోసారి వైరస్ గుబులు మొదలైంది. దేశంలో హెచ్‌ఎంపీవీ కేసులు వెలుగు చూసిన వేళ సూచీలు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు సూచీలను పడేశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1400 పాయింట్ల మేర పతనం కాగా... నిఫ్టీ 23,550 స్థాయికి చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.12 లక్షల కోట్ల మేర క్షీణించి రూ.439 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 79,281.65 (క్రితం ముగింపు 79,223.11) పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభనష్టాల మధ్య చలించింది. బెంగళూరులో ఇద్దరు చిన్నారుల్లో హెచ్‌ఎంపీవీని గుర్తించినట్లు వార్తలు రావడంతో సూచీల పతనం

- మిగతా 2 లో

ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకం సేవలు (ఈహెచ్‌ఎస్) క్యాష్‌లెస్, ఉచిత ఓపీలు సోమవారం నుంచి నిలిపివేసినట్లు ఆంధ్రప్రదేశ్ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆశా) వెల్లడించింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, కార్యదర్శి సీహెచ్ అవినాశ్ సోమవారం విజయ వాడలో మీడియా

- మిగతా 2 లో

అదానీలేనా... పేదలు పట్టరా?

దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న ప్రధాని

- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శ
- కులవ్యవస్థ నిర్మూలనకు వామపక్ష, ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని పిలుపు
- ఏఐడీఆర్‌ఎం జాతీయ మహాసభలు ప్రారంభం

విశాలాంధ్ర–హైదరాబాద్: కాయకష్టం చేసి దేశ సంపదను సృష్టిస్తున్న 90శాతం మంది దళితులు, ఆదివాసీలు, అట్టడుగు శ్రామిక వర్గాల బాగోగులు ప్రధాని మోదీకి పట్టవని... ఆయన ఆలోచనంతా అదాని, అంబానీల కోసమేలేనని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. ఈ దేశంలో సంపద సృష్టిస్తున్నది అదాని, అంబానీలు మాత్రమేనన్నది ప్రధాని ఉద్దేశమని పేర్కొన్నారు. పేదలు కాయకష్టంతో సృష్టించిన దేశ సంపదను ప్రధాని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో సోమవారం అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడీఆర్‌ఎం) రెండవ జాతీయ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సభాప్రాంగణంలో ఏఐడీఆర్‌ఎం పతాకాన్ని ఏఐడీఆర్‌ఎం జాతీయ అధ్యక్షులు రామ్మూర్తి ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డి.రాజా మహాసభలను ప్రారంభించారు. జాతీయ అధ్యక్షులు రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన మహాసభ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీపీఐ జాతీయ నాయకురాలు అనీ రాజా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ ఎం.బాల నరసింహా, ఎంపీ కె.రాధాకృష్ణన్, కాంగ్రెస్ ఎంఎల్ఏ గడ్డం వివేక్,

- మిగతా 2 లో

జగన్ విదేశీ ప్రయాణానికి 'నో'

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధుల కోర్టులో చుక్కెదురైంది. ఈనెల 16వ తేదీ లండన్‌లో తన కుమార్తె గ్రాడ్యుయేషన్ కార్యక్రమం ఉన్నందున ఈనెల 11 నుంచి రెండు వారాలపాటు విదేశీ ప్రయాణానికి అనుమతించాలంటూ జగన్ స్థానిక ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆయన పాస్‌పోర్టు గడువు ముగిసిన తర్వాత, మరలా పొడిగించకపోవడంతో ఆయన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఈనెల 3 వతేదీ

- మిగతా 2 లో

రూ.5 వేలకు పెన్షన్

- అతి సంపన్నులపై పన్నుల పెంపు
- ఆ మొత్తం అసంఘటిత కార్మికుల సంక్షేమానికి...
- కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్

న్యూఢిల్లీ: ఈపీఎఫ్ఓ పెన్షన్‌ను కనీసం రూ.5 వేలు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సత్వరమే 8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాయి. 2025–26 బడ్జెట్‌లో అతి సంపన్నులపై పన్నులు వేయాలని సూచించాయి. ఈ మేరకు సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన బడ్జెట్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల ప్రతినిధులు... కేంద్రం ముందు అనేక డిమాండ్లు ఉంచారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.10 లక్షలు చేయాలని కేంద్రానికి విన్నవించారు. గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. సమావేశం అనంతరం యూనియన్ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ ఆపాలని కేంద్రాన్ని కోరినట్లు టీయూసీసీ జాతీయ కార్యదర్శి ఎస్‌పీ తివారీ అన్నారు. ఈసారి బడ్జెట్‌లో సూపర్ రిచ్‌పై రెండు శాతం అదనంగా పన్ను వేసి... అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ఆ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు సైతం సామాజిక భద్రత కల్పించాలని, వారికీ కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఈపీఎస్ – 95 పెన్షన్ కింద ప్రస్తుతం చెల్లిస్తున్న కనీస పెన్షన్ రూ.1000 నుంచి రూ.5 వేలకు పెంచాలని భారతీయ మజ్దూర్ సంఘ్ కార్య నిర్వాహక కార్యదర్శి (నార్త్ జోన్) పవన్ కుమార్ కోరారు. దాన్ని వీడీఏకు అనుసంధానం చేయాలన్నారు. రూ.10 లక్షల వరకు ఆదాయపు పన్నును మినహాయించడంతో పాటు పెన్షన్ మొత్తంపై పూర్తిగా ఆదాయపు పన్ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఏడో వేతన కమిషన్ ఏర్పాటు చేసి పదేళ్లు (2014లో) దాటిపోయిందని, 8వ వేతన కమిషన్‌ను సత్వరమే ఏర్పాటు చేయాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి స్వదేశ్ దేవ్ రాయ్ పేర్కొన్నారు. 1980ల్లో కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగుల సంఖ్య 21 లక్షలుగా ఉండగా... 2023–24 నాటికి అది 8 లక్షలకు చేరడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

చర్లపల్లి రైల్వే టెర్మినల్ జాతికి అంకితం

విశాలాంధ్ర–హైదరాబాద్: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సాంకేతికత, అత్యాధునిక సౌకర్యాలతో రూ.413 కోట్లతో దీన్ని నిర్మించారు. ప్రారంభ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా హాజరయ్యారు.

కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యం: మోదీ

కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మోదీ ఈ సందర్భంగా చెప్పారు. మెట్రో నెట్‌వర్క్ పరిధి వెయ్యి కిలోమీటర్లకు పైగా విస్తరించిందని పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్, ఒడిశా, తెలంగాణలో కొత్త కనెక్టివిటీకి ఏర్పాట్లు జరిగాయని వివరించారు. 'ఒక్కో అడుగు వేసుకుంటూ రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆధునికీకరణతో పాటు ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా కృషి చేస్తున్నాం. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి హైస్పీడ్ రైళ్లు పరుగులు పెడుతున్నాయి. వీటిలో స్లీపర్ సౌకర్యాలను కల్పించనున్నాం. కొత్త రైల్వే ట్రాక్‌లతో పాటు అండర్ బ్రిడ్జి నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం. చర్లపల్లి టెర్మినల్ ద్వారా సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లపై ఒత్తిడి తగ్గుతుంది. దేశవ్యాప్తంగా హైస్పీడ్ రైళ్ల కోసం డిమాండ్ పెరుగుతోంది. దశాబ్ద కాలంలో రైల్వే కొత్త రూపు సంతరించుకుంది. దేశంలో 35 శాతం విద్యుదీకరణ పూర్తయింది. వందేభారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు తెచ్చాం. రైల్వేల ఆధునికీకరణ దేశ ముఖచిత్రాన్నే మారుస్తోంది' అని మోదీ చెప్పారు. 2014లో 74 ఉన్న విమానాశ్రయాల సంఖ్య నేడు 150కి పైగా పెరిగిందని, దేశవ్యాప్తంగా ఐదు నుంచి 21 నగరాలకు మెట్రో సేవలు విస్తరించాయని వివరించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ రైల్వేలు రవాణా రంగంతో పాటు దేశానికి జీవన రేఖ అని పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సుమారు 1,300 రైల్వే స్టేషన్లను, తెలంగాణలోని 40 ముఖ్యమైన రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. యాదాద్రి యాత్రికుల కేంద్రానికి ఎంఎంటీఎస్ అనుసంధానానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. కొమురవెల్లి పుణ్యక్షేత్రంనకు త్వరలో కొత్త రైల్వే స్టేషన్ రాబోతోంది అని అన్నారు. కేంద్ర మంత్రి వి.సోమన్న మాట్లాడుతూ... చర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవం ఒక చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.32 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ రైల్వే మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం తనవంతు సహకారాన్ని అందజేస్తుందని పేర్కొన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ... భారతీయ రైల్వేల ముఖచిత్రాన్ని మార్చేందుకు జాతీయ స్థాయిలో వెయ్యి కంటే ఎక్కువ రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, సీనియర్ రైల్వే అధికారులు , కీసర ఆర్డీవో సైదులు పాల్గొన్నారు.

కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ: రేవంత్

చర్లపల్లి టెర్మినల్ ప్రారంభించిన ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి డ్రైపోర్టు ఇవ్వాలని, ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. మెట్రో రైలు విస్తరణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. దేశంతో పాటు రాష్ట్రాల అభివృద్ధికి రైల్వేలే కీలకమని అన్నారు. భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి ఇది ఉపయోగపడుతుందని వివరించారు. వికారాబాద్ నుంచి కృష్ణా రైలు మార్గాన్ని

- మిగతా 2 లో

మోదీతో సత్య నాదెళ్ల భేటీ

న్యూఢిల్లీ: కృత్రిమ మేధను విస్తరించడంలో భారత్‌తో కలిసి పనిచేస్తామని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల పేర్కొన్నారు. భారత్‌ను ఏఐ-ఫస్ట్‌గా రూపొందించడం కోసం పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి భారతీయుడు వీటి ప్రయోజనాలు పొందేందుకు వీలుగా తమ సేవలు విస్తరిస్తామన్నారు. ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. సత్య నాదెళ్లతో భేటీ కావడంపై మోదీ స్పందించారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏఐ తదితర అంశాలపై తాము చర్చించామన్నారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్ విస్తరణ, పెట్టుబడుల

- మిగతా 2 లో

చత్తీస్‌గఢ్‌లో
మావోయిస్టుల పంజా

- భద్రతా బలగాల వాహనం పేల్చివేత
- 9 మంది జవాన్ల మృతి

విశాలాంధ్ర–చింతూరు: చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు పంజా విసిరారు. కుత్రు అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలు ప్రయాణిస్తున్న వాహనాన్ని మందుపాతరతో మావోయిస్టులు పేల్చివేశారు. ఈ ఘటనలో 9 మంది జవాన్లు మృతి చెందగా... ఏడుగురు గాయపడ్డారు. మృతుల్లో డ్రైవర్ ఉన్నాడు. ఐఈడీ పేలిన సమయంలో వ్యాన్‌లో 15 మంది జవాన్లు ఉన్నారు. క్షతగాత్రులను బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భద్రతా బలగాలు ప్రయాణిస్తున్న వాహనం కుత్రు అటవీప్రాంతంలోని ఓ మార్గం వద్దకు రాగానే... మావోయిస్టులు మందు పాతర పేల్చారు. దీంతో రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. పోలీసు వాహనం తుక్కుతుక్కైంది. దంతెవాడ, నారాయణపూర్, బీజాపూర్ సరిహద్దుల్లో పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్ నిర్వహించి... తిరిగి వెళ్తుండగా దారిలో కాపు కాసిన మావోయిస్టులు ఐఈడీని పేల్చారు. కొన్నాళ్లుగా చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతను భద్రతా బలగాలు ముమ్మరం చేశాయి. శనివారం అర్ధరాత్రి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

4,14,40,447
ఏపీ ఓటర్ల సంఖ్య ఇదే



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన తుది ముసాయిదా జాబితా ఓటర్ల ప్రకారం (జనరల్, సర్వీసు కలిపి) మొత్తంగా 4,14,40,447 నమోదయ్యారు. ఇందులో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 2,03,52,816, మహిళలు 2,10,84,231 మంది, థర్డ్

- మిగతా 2 లో



2030 నాటికి 22,448 మెగావాట్ల
విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక

- 9న కొత్త ఎనర్జీ పాలసీ...
- బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరు: భట్టి

2 లో

కమ్యూనిస్టుల నారుమడి బెనారస్

అనిబిసెంట్ 1898లో నెలకొల్పిన సెంట్రల్ హిందూ కళాశాల 1916లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంగా మారింది. దీనికి ప్రధాన కారకుడు మదన్ మోహన్ మాలవియా. మాలవియా 1911కల్లా అనిబిసెంట్ నెలకొల్పిన కళాశాల మీద శ్రద్ధ చూపించడం మొదలు పెట్టారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

హెచ్ఎంపీవీ కలకలం

(మొదటిపేజీ తరువాయి)

కేసులు నమోదయ్యాయని తెలిపింది. ఆందోళన అవసరం లేదని పేర్కొంది. ఇదిలా ఉండగా, బెంగళూరులో మూడు నెలల చిన్నారి వైరస్ నుంచి కోలుకుని ఆసుపత్రి నుంచి విడుదల కాగా... మరో ఎనిమిది నెలల చిన్నారి చికిత్స పొందుతోంది. వైరస్ వెలుగు చూసిన దేశాల్లో వీరి కుటుంబాలు ప్రయాణాలు చేయలేదని తెలిపింది. చైనాలో కలకలం సృష్టిస్తున్న వైరస్... ఇదీ ఒకటా కాదా తెలియాల్సి ఉంది. హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు ఫ్లూ, ఇతర శ్వాసకోశ సంక్రమణ మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుంది. చిన్నారులు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక శక్తి కలిగిన వ్యక్తులు ఈ వైరస్ బారినపడే అవకాశాలు అధికంగా ఉంటాయని అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ పేర్కొంది. చైనాలో హ్యూమన్ మెటానిమో వైరస్ సహా శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న వార్తలతో భారత్ ఇప్పటికే అప్రమత్తమైంది. ఇటీవలే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన జాయింట్ మానిటరింగ్ గ్రూప్ (జేఎంజీ) సమావేశం నిర్వహించింది. శీతాకాలంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగానే చైనాలో ఇన్ఫ్లుయెంజా, ఆర్ఎస్వీ, హెచ్ఎంపీవీ తరహా వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయని జేఎంజీ తేల్చి చెప్పింది. భారత్‌లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ముందస్తుచర్యల్లో భాగంగా ఇప్పటికే వివిధచోట్ల ఆర్ఎస్వీ, హెచ్ఎంపీవీ తదితర పరీక్షలు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఒకవేళ శ్వాసకోశ వ్యాధులు అనుకోకుండా పెరిగినా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. కాగా, ఇద్దరు చిన్నారులకు వైరస్ సోకడంతో కర్నాటక ప్రభుత్వం అప్రమత్తమైంది. వైద్యారోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. వైరస్ మరింత వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో మాట్లాడుతూ... ఇప్పటికే ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కింద రూ.3 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.1500 కోట్లు విడుదల చేసినప్పటికీ ఇంకా బకాయిలు రావాల్సి ఉంది. ఆసుపత్రుల ఆర్థిక పరిస్థితి బాగోలేదు. ఉచిత వైద్య సేవలు అందించలేమని నాయయకులు తేల్చి చెప్పారు. బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఆస్పత్రులకు ఔషధాలు, వైద్య పరికరాలు, రసాయనాల సరఫరాను వ్యాపారులు నిలిపివేశారు. ఓవర్ డ్రాఫ్ట్ కావడంతో బ్యాంకులు సైతం సహకరిం చడం లేదు. జనవరి 6వ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిపి వేస్తున్నట్లు ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులపై స్పందించి... ట్రస్ట్ సీఈఓ ఫోన్ చేసి బకాయిలు క్లియర్ చేస్తామని చెప్పి... అసోసియేషన్ నేతలను చర్చలకు ఆహ్వానించారు. ప్రభుత్వంపై గౌరవంతో తొలుత ఓపీ, ఈహెచ్ఎస్ సేవలు మాత్రమే నిలిపివేసినట్లు అసోసియేషన్ నేతలు ప్రకటించారు. ఆరోగ్య బీమా పథకంలోకి ప్రభుత్వం వెళితే రాష్ట్రంలో ప్రైవేట్ ఆస్పత్రుల మనుగడ కష్టమని అభిప్రాయపడ్డారు. ఇందులో కనీసం కో-పేమెంట్ విధానాన్ని అమలు చేయాలని విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా ద్వారా 100 శాతం క్యాష్‌లెస్ అంటే ఆస్పత్రులు నడపడం కష్టమని స్పష్టంచేశారు. ఈ అంశంపై ఆస్పత్రుల యాజమాన్యాలు సమావేశమై సుదీర్ఘంగా చర్చించాయి. ఈనెల 25 వరకూ ప్రభుత్వానికి గడువు ఇద్దామని, అప్పటికి కనీసం రూ.1,500 కోట్ల బకాయిలు విడుదల చేయకపోతే సేవలు నిలిపివేయాలని మెజార్టీ సభ్యులు ప్రతిపాదించారు. దీనిపై ఆశా తుది నిర్ణయానికి రావాల్సి ఉంది. వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి టి.కృష్ణబాబు అధ్వర్యంలో ఆశా ప్రతినిధులను మంగళవారం చర్చలకు ఆహ్వానించారు. ప్రభుత్వ అధికారులతో చర్చల తర్వాత తుది నిర్ణయం తీసుకోవాలని అసోసియేషన్ నేతలు నిర్ణయించారు.

రూ.12 లక్షల కోట్లు ఆవిరి

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమైంది. అనంతరం భారీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 77,781.62 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ... చివరికి 1258.12 పాయింట్ల నష్టంతో 77,964.99 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 388.70 పాయింట్లు నష్టపోయి 23,616.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మార కం విలువ మరో 3 పైసలు క్షీణించి 85.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, సన్‌ఫార్మా షేర్లు మినహా మిగిలిన అన్ని కంపెనీల షేర్లూ నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 76.30 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా... బంగారం ఔన్సు 2645 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

4,14,40,447

(మొదటిపేజీ తరువాయి)

జెండర్లు 3,400 వేల మంది ఉన్నారు. ఈ జాబితాలో జనరల్ ఎన్నికల విభాగానికి సంబంధించి మొత్తం ఓటర్లు 4,13,73,757 మంది ఉండగా... అందులో పురుషులు 2,02,88,543 మంది, మహిళలు 2,10,81,814, థర్డ్ జెండర్లు 3,400 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్ల విభాగంలో మొత్తం ఓటర్లు 66,690 మంది నమోదయ్యారు. ఇందులో పురుషులు 64,273 మంది, మహిళలు 2,417 మంది ఉన్నారు. ఇదే తరహాగా అన్ని జిల్లాల వారీగా ఓటర్ల జాబితాను వెల్లడించారు. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు, ఓటర్ల జాబితాల ముసాయిదా ప్రచురణకు ముందే అన్ని జిల్లాల్లో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తయింది. అది 2024 పోలింగ్ కేంద్రాల పోలిస్తే సంఖ్యతో 2025కి గాను పెరుగు దల ఉంది. తద్వారా పోలింగ్ కేంద్రాల సంఖ్య 46,165 నుంచి 46,397కి పెరిగింది. తదనుగుణంగా, హేతుబద్ధీ కరించబడిన పోలింగ్ కేంద్రాల ప్రకారం 29 అక్టోబరు 2024న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. 28 నవంబరు 2024 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించారు. అభ్యంతరాల పరిష్కారం తర్వాత, తుది ఓటర్ల జాబితాను ఈనెల 6వ తేదీన ప్రచురించారు. మొత్తం పోలింగ్ కేంద్రాలు 46,387గా నిర్ధారించారు. ఈ ఓటర్ల జాబితాలో 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ఓటర్లు 5,14,646 మంది ఉన్నారు.

అమెరికాను వణికిస్తున్న మంచు తుపాను

వాషింగ్టన్: అమెరికాపై మంచు తుపాను విరుచుకుపడింది. 'వింటర్ స్టార్మ్' తుపాను సుమారు 6 కోట్ల మంది అమెరికన్లపై తీవ్ర ప్రభావం చూపనున్నది. అనేక ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మొత్తం ఏడు రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. కాన్సాస్ సిటీపై అధిక ప్రభావం పడింది. మిస్సోరీ, కెంటకీ, వర్జీనియా, వెస్ట్ వర్జీనియా, అర్కాన్సాస్, న్యూజెర్సీ రాష్ట్రాల్లోనూ మంచు తుపాను బీభత్సం సృష్టిస్తోంది. మంచు తుపానుకు బ్లెయిర్‌గా నామకరణం చేశారు. సుమారు 30 రాష్ట్రాల్లో ఆ ప్రభావం ఉంది. బ్లెయిర్ తుపాను వల్ల.. అధిక స్థాయిలో మంచు, ఐస్, సబ్ జీరో ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. పోలార్ వొర్టెక్స్ వల్ల విపరీత వాతావరణ పరిస్థితులు ఏర్పడినట్లు వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వీస్తున్న చలిగాలి సెంట్రల్ అమెరికాను ప్రస్తుతం వణికిస్తున్నది. ఇప్పటికే వేల సంఖ్యలో విమానాలు ఆలస్యం అవుతున్నాయి. కొన్నింటిని రద్దు కూడా చేశారు. తుపాను వల్ల అనేక ప్రాంతాల్లో రహదారులపై ట్రాఫిక్ స్తంభించింది. స్కూళ్లను మూసివేశారు. సోమవారం తర్వాత పరిస్థితులు మెరుగయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కాన్సాస్ సిటీలో 32 ఏళ్ల తర్వాత మళ్లీ భారీ స్థాయిలో మంచు కురిసింది. రానున్న కొన్ని రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరీ దారుణంగా పడిపోనున్నాయి.

మైనస్ 10 నుంచి 15 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కాన్సాస్‌కు ప్రత్యేకంగా హెచ్చరిక జారీ చేశారు. ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావద్దని హెచ్చరించారు. ఫిలడెల్ఫియాలో స్కూళ్లు, ప్రభుత్వ ఆఫీసులను మూసివేశారు. మిస్సోరీ, ఇలియనాస్, లూసియానా, కెంటకీ రాష్ట్రాల్లో.. సుమారు రెండు లక్షల ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. భీకరంగా కురుస్తున్న మంచు, వర్షం వల్ల.. కాన్సాస్ విమానాశ్రయాన్ని మూసివేశారు.

హసీనాపై మరోసారి అరెస్ట్ వారెంట్

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఆ దేశ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ)మరోసారి అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డా రంటూ ఆమెతో పాటు మరో 12 మందికి ఈ వారెంట్ జారీ చేసింది. హసీనా రక్షణ సలహాదారు మేజర్ జనరల్ (రిటైర్డ్) తారిక్ అహ్మద్ సిద్ధిఖీ, మాజీ ఐజీ బెనజీర్ అహ్మద్, మాజీ నేషనల్ టెలికమ్యూనికేషన్ మానిటరింగ్ సెంటర్ డీజీ జియావుల్ అహ్సాన్ వంటి వారు కూడా ఈ జాబితాలో ఉన్నారు. వీరందరినీ ఫిబ్రవరి 12వ తేదీలోపు కోర్టు ఎదుట ప్రవేశపెట్టాలని పేర్కొంది. కాగా, హసీనా దేశం విడిచి భారత్‌కు వెళ్లిపోయిన నాటి నుంచి ఆమెపై జారీ అయిన రెండో వారెంట్ ఇది. మొదటి వారెంట్ 2024 అక్టోబర్ 17న జారీ అయిన సంగతి విదితమే. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినందుకు ఆమెతో పాటు మరో 45 మందిపై ట్రిబ్యునల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. వారెంట్లు జారీ అయిన వారిలో హసీనా పార్టీ అవామీ లీగ్ అగ్ర నేతలు ఉన్నారు. వీరందరినీ నవంబర్ 18లోగా తమ ముందు హాజరు పరచాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. అయితే, ఆ ఆదేశాలు అమలు కాలేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు ఉధృతం కావడంతో ఆగస్టు 5న హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌లో తలదాచుకున్నారు.

బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిన ఉత్తర కొరియా

సియోల్: ఉత్తర కొరియా మరోసారి బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. తూర్పు తీరం దిశగా ఆ ప్రయోగం సాగినట్లు దక్షిణ కొరియా మిలటరీ వెల్లడించింది. సుమారు రెండు నెలల విరామం తర్వాత మళ్లీ ఉత్తర కొరియా క్షిపణి పరీక్ష చేపట్టింది. సముద్రంలో కూలిపోవడానికి ముందు ఆ క్షిపణి దాదాపు 1100 కిలోమీటర్లు ప్రయాణించింది. అయితే ఉత్తర కొరియా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నట్లు దక్షిణ కొరియా ఆరోపించింది. దక్షిణ కొరియా నేతలతో సియోల్‌లో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చర్చలు నిర్వహిస్తున్న సమయంలో ఈ పరీక్ష జరిగింది. ఉత్తర కొరియా నిర్వహిస్తున్న క్షిపణి పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని అమెరికాకు చేరవేస్తున్నట్లు దక్షిణ కొరియా పేర్కొంది. కాగా దక్షిణ కొరియాలో రాజకీయ సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అరెస్టు చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రతిపక్షాలు ఆయన్ను అభిశంసించాయి.

2030 నాటికి 22,448 మెగావాట్ల

విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశ, విదేశీ పెట్టుబడులు ఆకర్షించే విధంగా ఈ నెల తొమ్మిదో తేదీన న్యూ ఎనర్జీ పాలసీని ప్రకటిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సచివాలయం ఎదురుగా ఉన్న దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జెన్కోలో ఉద్యోగం పొందిన 315 మంది ఏఈలకు సోమవారం నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రంలో న్యూ ఎనర్జీ పాలసీ తీసుకురాలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణను మిగులు విద్యుత్తు ఉత్పత్తి రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు తయారు చేశామన్నారు. అందులో భాగంగానే దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడానికి అవకాశం ఉండటంతో ఇటీవల క్యాబినెట్ సమావేశంలో న్యూ ఎనర్జీ పాలసీని ఆమోదించామని వివరించారు. 2030 నాటికి తెలంగాణకు కావలసిన 22,448 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. రామగుం డంలో జెన్కో, సింగరేణి సంస్థ సంయుక్త అధ్వ ర్యంలో థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం... ఒడిశాలో ఉన్న నైనీ కోల్ బ్లాకును అక్కడి ప్రభుత్వంతో చర్చించి సింగరేణి సంస్థకు అప్పగించామన్నారు. సోషల్ మీడియా, తమకు అనుకూలంగా ఉండే పత్రికలను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పాలనలో కరెంటు లేకుండా పోతుందని చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు విశ్వసించలేదన్నారు. తెలంగాణ లో చదువుకున్న ప్రతి బిడ్డకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. గత పది సంవత్సరాలు కొలువులు లేక నిరాశ నిస్పృహలకు గురైన నిరుద్యోగ యువత ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ఉద్యోగాలు వస్తాయని ప్రజా ప్రభుత్వాన్ని తీసుకువచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించినట్టు గుర్తు చేశారు. ఇప్పటి వరకు 56 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసినట్లు వివరించారు.

'చెమట చుక్కలకు తర్ఫీదు' లోగో ఆవిష్కరణ

సింగరేణి కాలరీస్ అధ్వర్యంలో రూపొందించిన 'చెమట చుక్కలకు తర్ఫీదు' లోగోను భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. దేశ విదేశాల్లో ఉన్నత విద్య ఉపాధి అవకాశాలపై అవగాహన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కోల్బెల్టు యువతను నిలిపే ప్రయత్నం చేస్తున్న సింగరేణి సంస్థ యజమాన్యాన్ని అభినందించారు. ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎనర్జీ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానీయా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, జెన్కో డైరెక్టర్లు పాల్గొన్నారు.

చర్లపల్లి రైల్వే టెర్మినల్ జాతికి అంకితం

(మొదటిపేజీ తరువాయి)

కల్వకుర్తి నుంచి మాచర్ల మధ్య కొత్త రైల్వే లైన్లు, డోర్నకల్ నుంచి రెండు లైన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి ఎంఐఎంను కలుపుకుని ముందుకు వెళతామని అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, నగర అభివృద్ధిలో అందరి సహకారం కోరతామన్నారు. ఆరాంఘర్ - జూపార్క్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభించారు. వైఎస్ హయాంలో అతి పెద్ద ఫ్లైఓవర్, పీవీ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించినట్టు గుర్తు చేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనంలాంటి ప్రాజెక్టులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మీరాలం ట్యాంక్ పై కేబుల్ బ్రిడ్జి నిర్మించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే గోషామహల్ లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని స్పష్టం చేశారు.

జగన్ విదేశీ ప్రయాణానికి 'నో'

(మొదటిపేజీ తరువాయి)

సీబీఐ కోర్టులో కూడా విదేశీ ప్రయాణానికి అనుమతి కోరుతూ జగన్ పిటిషన్ దాఖలు చేశారు. జగన్ కేసుల విషయంలో ఇప్పటికే విచారణ తీవ్ర జాప్యం జరుగుతున్నందున అనుమతి ఇవ్వవద్దంటూ సీబీఐ తరపు న్యాయవాది వాదించారు. విచారణలో జాప్యానికి పిటిషనర్ కారణం కాదని, ఆయన కేసు వాయిదా వేయాలని ఎప్పుడూ కోరలేదని, అలాగే గతంలో విదేశీ పర్యటనలకు అనుమతులు ఇచ్చినప్పుడూ కోర్టు షరతులను ఉల్లంఘించలేదని జగన్ తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి వాదించారు. దీనిపై తదుపరి విచారణను ఈనెల 8వ తేదీకి వాయిదా వేయగా, స్థానిక ప్రజాప్రతినిధుల కోర్టు మాత్రం జగన్ పిటిషన్‌ను కొట్టివేసింది.

మోదీతో సత్య నాదెళ్ల భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రణాళిక గురించి తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అలాగే, మోదీతో అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవాన్ భేటీ అయ్యారు. ఈ భేటీ గురించి ప్రధాని 'ఎక్స్' వేదికగా షేర్ చేసుకున్నారు. భారత్- అమెరికా మధ్య సహకారం ఉన్నత శిఖరాలకు చేరిందన్నారు. 'సాంకేతికత, రక్షణ, అంతరిక్షం, బయోటెక్నాలజీ, కృత్రిమమేధ రంగాలు సహా భారత్- అమెరికా మధ్య అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం ఉన్నత శిఖరాలకు చేరుకుంది. రెండుదేశాల ప్రయోజనాలతో పాటు ప్రపంచ అభివృద్ధి కోసం భారత్- అమెరికా మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం' అని మోదీ ట్వీట్ చేశారు.

అదానీలేనా...పేదలు పట్టరా?

(మొదటిపేజీ తరువాయి)

ఏఐడీఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.నిర్మల్ కుమార్, జాతీయ నాయకులు, మాజీ ఎంఎల్ఏలు ఎన్.రాజన్, జి.లత, జాతీయ నాయకులు మనోజ్ బి ఎడమన్నా, దేవి కుమారి, గుల్జార్ సింగ్ బోరియా, కె.సుబ్బారావు, మహదేవ్ కుడే, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్న, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పాల్గొన్నారు. రాజా ప్రారంభోపన్యాసం చేస్తూ... ఆడ మగా తేడాలేకుండా మన దేశంలో పుట్టిన ప్రతి బిడ్డ భవిష్యత్తును కులాలు నిర్ణయించే దౌర్భాగ్య పరిస్థితి ఉందన్నారు. ఈ దారుణ పరిస్థితులు పోవాలంటే మనిషిగా పుట్టిన వారంతా ఒక్కటేనని, ఒకే కుటుంబం అన్న భావన రావాలని, అప్పుడే ఈ దేశం ప్రగతిపథంలో పురోగమించడమే కాకుండా డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కలలు కూడా సాకారమవుతా యని తెలిపారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో ముఖ్య భూమిక పోషించిన దళితులు, ఆదివాసీలు నేటికీ అత్యంత వివక్షతను ఎదుర్కొంటున్నారని, దీనికి ఈ దేశంలోని కుల వ్యవస్థే కారణమన్నారు. దళితులు, ఆదివాసీలు లేనిదే ఈ దేశం లేదని, వారి శ్రమ ఫలితమే ఈ దేశ సంపద అని రాజా పేర్కొన్నారు. ప్రపంచంలో ఆర్థికంగా భారత్ 5వ శక్తివంతమైన దేశమని ప్రధాన మంత్రి పదే పదే మాట్లాడుతుం టారని, ఇది ఈ దేశంలో ఉన్న 90 శాతంగా ఉన్న అట్టడుగు వర్గాల ప్రజలు తమ శ్రమతో సృష్టించిన సంపద ద్వారానే సాధ్యమైందన్న విషయాన్ని అందరూ మరిచిపోతున్నారన్నారు. ఈ సంపద సృష్టిస్తున్న 90 శాతం మంది దేశ ప్రజలు నిత్యం నిరుపేదలుగా మారుతుంటే కనీసం శ్రమ అనేదే తెలియని కొంతమంది లక్షల కోట్ల రూపాయలకు ఎగబాకుతున్నారని పేర్కొన్నారు. దేశంలో కుల వ్యవస్థను నిర్మూలించడానికి వామపక్ష, ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని, ఇందుకు అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం కీలక భూమిక పోషించాలని రాజా సూచించారు. ఎంపీ, దళితశోషన్ ముక్తి మంచ్ జాతీయ అధ్యక్షులు రాధాకృష్ణన్ మాట్లాడుతూ మనిషి తన మేధోశక్తితో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనే సాకేంతిక పరిజ్ఞానాన్ని సృష్టించ గలిగాడు కానీ, కుల వ్యవస్థను నిర్మూలించలేకపోతున్నామన్నారు. ఈ దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ శక్తులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టడానికి దళితులు, ఆదివాసీలు ఐక్యం కావాలని ఆయన కోరారు. అనీ రాజా మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లో ఓ నీటి పంపు వద్ద 8 ఏళ్ల బాలిక లేచి నిలబడితే ఆమె నీడ అక్కడి నుంచి వెళుతున్న అగ్రవర్ణ వ్యక్తిపై పడిందనే నెపంతో ఆ కుటుంబాన్ని అంత మొందించిన అనాగరిక సమాజంలో మనం ఉన్నందుకు సిగ్గు పడాలాన్నారు. దళితుల హక్కులు, అభ్యున్నతి కోసం జరిగే ఉద్యమాల్లో సీపీఐ ఏఐడీఆర్ఎంతో భుజం భుజం కలిపి నడుస్తోందని తెలిపారు. ఎంఎల్ఏ గడ్డం వివేక్ మాట్లాడుతూ దళితులు ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రానున్న బడ్జెట్‌లో 25 శాతం నిధులు కేటాయించాల్సిందేనన్నారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ దళితుల శ్రమతోనే ఈ దేశం ముందుకు సాగుతోందన్నారు. బొగ్గు గనులు మొదలు పారిశుద్ధ్యం, లెదర్, నిర్మాణ రంగం, వ్యవసాయం ప్రతి పనిలోనూ తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి దళితులు, ఆదివాసీలే శ్రామికులుగా సంపదను సృష్టిస్తున్నారని చెప్పారు. దళితుల ఆదివాసీలకు రిజర్వేషన్లు కల్పించడం దయాదాక్షిణ్యాలు కాదని, అది వారి హక్కు అని, లక్షల వేల కోట్ల సంపదను సృష్టిస్తున్న ఈ వర్గాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దళితులు, ఆదివాసీలకు రాజ్యాంగం చట్టబద్ధంగా అనేక హక్కులు కల్పించినప్పటికీ ఇప్పటికీ వివక్షత కొనసాగడం దుర్మార్గమన్నారు. దళితులు, ఆదివాసుల సంక్షేమం, అభివృద్ధికి నామ మాత్రమే నిధులను కేటాయిస్తున్న ప్రభుత్వాలు వాటిని కూడా సక్రమంగా ఖర్చు చేయని ఫలితంగా వివిధ వర్గాల అభివృద్ధి ఎండమావిగానే మారుతోందన్నారు. వీటన్నింటికి వ్యతిరేకంగా ఏఐడీఆర్ఎం ఉద్యమించాలని, దీనికి సీపీఐ పూర్తి తోడ్పాటునందిస్తుందని తెలిపారు.

అమరులకు సంతాపం...

ఇటీవల మరణించిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, బీకేఎంయు జాతీయ అధ్యక్షులు అతుల్ కుమార్ అంజన్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరితో పాటు ఏఐడీఆర్ఎం నాయకుల మృతి పట్ల మహాసభ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు సంతాప తీర్మాన్ని సభ ఆమోదించగా... రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అన్ని విధాలుగా కుప్పం అభివృద్ధి

దేశంలోనే అత్యుత్తమ నియోజకవర్గంగా చేస్తా: చంద్రబాబు

విశాలాంధ్ర-కుప్పం: కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అయినా కుప్పానికి ఎమ్మెల్యేనే అని, 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించిన కుప్పం ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని అన్నారు. గత పాలకులు కక్షపూరితంగా కుప్పం అభివృద్ధిని అడ్డుకున్నారని, టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై కుప్పం అభివృద్ధి అన్ స్టాపబుల్ అని, అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకే స్వర్ణ కుప్పం విజన్-2029 నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పీపీపీ విధానంతో కుప్పం దశదిశ మారుస్తానని చెప్పారు. ద్రవిడ యూనివర్సిటీలో స్వర్ణ కుప్పం విజన్- 2029 డాక్యుమెంట్‌ను సీఎం ఆవిష్క రించారు. ఐదేళ్లలో కుప్పం నియోజక వర్గ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కుప్పం ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ఏర్పాటు చేసి దానికి స్పెషల్ ఆఫీసర్ గా యువ ఐఏఎస్ కు బాధ్యతలు అప్పగించానని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో పేదరికం లేకుండా ఉండేందుకు ప్రతి కుటుం బాన్ని ఆర్థికంగా పైకి తీసుకొస్తామ న్నారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు స్థాపించి 15 వేల ఉద్యోగాల కల్పన, రహదారుల నిర్మాణం, జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు, నైపుణ్య శిక్షణా కేంద్రాల ఏర్పాటు, కార్గో ఎయిర్ పోర్టు పూర్తిచేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం, అర్హులకు పెన్షన్లు, దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు పంపిణీ, సూపర్ స్పెషాలిటీ ఏరియా ఆస్పత్రి నిర్మాణం, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత నీరు, ఎలక్ట్రికల్ సైకిళ్ల పంపిణీ, డ్వాక్రా మహిళలకు ప్రోత్సాహకాలు అందించి కుప్పం నియోజకవర్గాన్ని మోడ్రన్‌గా, టూరిజం హబ్ గా తయారు చేయడం వంటి నిర్దిష్ట ప్రణాళికతో స్వర్ణ కుప్పం విజన్ - 2029 రూపొందించామని వివరించారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం...

గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంస పాలన జరిగిందని, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని చంద్రబాబు విమర్శించారు. ప్రజల్ని స్వేచ్ఛగా మాట్లాడనివ్వకుండా అణచివేశార న్నారు. ఒక సమర్థ నాయకుడు ఉంటే ఏదైనా సాధ్యమని నిరూపించిన పార్టీ తెలుగుదేశమేనని చెప్పారు. ద్రవిడ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని, దురదృష్టవశాత్తు దేవాలయం లాంటి యూనివర్సిటీలను కూడా రాజకీయ పునరావాస కేంద్రా లుగా వైసీపీ వాడుకుందన్నారు. వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి కల్పనే తన లక్ష్యమని పునరుద్ఘాటించారు. 1995లో సీఎంగా ఉండగా... సైబరా బాద్ ప్రాంతమంతా రాళ్లు, రప్పలతో నిండి ఉందని, అక్కడ ఐటీని అభివృద్ధి చేసేందుకు హై టెక్ సిటీ నిర్మించా నని... ప్రపంచంలోనే నం.1 ఐటీ సిటీగా హైదరాబాద్ తయారవుతుందని ఆనాడే చెప్పానన్నారు. మనమంతా సమిష్టిగా పనిచేస్తే అద్భుతాలు సృష్టించ వచ్చునన్నారు. రాష్ట్రంలో నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, జూన్ లోగా హంద్రీనీవా జలాలను పాలారు వాగుకు తీసుకొస్తామని తెలిపారు. ఈ వాగుపై చెక్ డ్యామ్ కూడా నిర్మిస్తామన్నారు. నీటి భద్రత, కరవు నివారణ కోసం గోదావరి నీళ్లను బనకచర్లకు తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చంద్రబాబు వెల్లడించారు. టెక్నాలజీ సాయంతో వ్యవసాయం లాభసాటిగా మార్చడంతో పాటు ఖర్చు తగ్గించే విధానాలపై దృష్టి పెట్టామని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం ద్రవిడ యూనివర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానమిచ్చి కుప్పం అభివృద్ధికి తీసుకుంటున్న ప్రణాళికలను వివరించారు.

చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల పంజా

(మొదటిపేజీ తరువాయి)

చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందగా... ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం భద్రతా దళాలు మావోయిస్టుల కోసం గాలిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనను బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్ ధ్రువీకరించారు.

పిరికిపంద చర్య: సీఎం

మావోయిస్టుల మందుపాతరలో 9 మంది మరణించడం బాధాకరమని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఆవేదన వెలిబుచ్చారు. అమరవీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమరులైన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని, మృతుల కుటుంబాలకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. బస్తరులో కొనసాగుతున్న మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమంతో విసుగు చెందిన మావోయిస్టులు దిక్కుతోచని స్థితిలో ఇలాంటి పిరికిపంద చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. జవాన్ల బలిదానాలు వృధా కాబోవని, మావోయిస్టులను పూర్తిగా రూపుమాపేందుకు తమ పోరాటం బలంగా కొనసాగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ఇల్లందు - విశాలాంధ్ర : రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా ఎలాంటి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని సీఐ బత్తుల సత్యనారాయణ ప్రజలను కోరారు. సంఘ వ్యతిరేక పనులకు పాల్పడినట్లయితే చట్ట ప్రకారం ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో డీఎస్పీ చంద్రభాను పర్యవేక్షణలో ఇల్లందు పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. సంక్రాంతి పండుగను కుటుంబాలతో కలిసి సాంప్రదాయ బద్ధంగా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నిషేధించిన కోడిపందాలు, జూదం, పేకాట లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఇల్లందు పరిధిలో నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. తమ పోలీస్ సిబ్బందితో ప్రతి గ్రామంలో ప్రత్యేక నిఘా ఉంటుందని సిఐ తెలిపారు.

వార్షిక పరీక్షలపై దృష్టి పెట్టండి

విశాలాంధ్ర - పినపాక : విద్యార్థులను వార్షిక పరీక్షలకు సంసిద్ధులు చేసి మంచి ఫలితాలు రాబట్టాలని ప్రత్యేక అధికారి యాదగిరి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు అధ్యాపకులను ఆదేశించారు. సోమవారం పినపాక మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రత్యేక అధికారి యాదగిరి తోపాటు డిఈఓ వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ప్రిన్సిపల్ ఎం. సత్యనారాయణ, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రాప్ అవుట్ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. హాజరు శాతాన్ని పెంచాలని వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. గత సంవత్సరం కంటే ఈ దఫా ఉత్తీర్ణత శాతం పెంచాలని ఆదేశించారు. విద్యార్థిని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో చదివి చేతులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్ : ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత శాఖల వారికి పంపి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వివిధ మండలాల నుండి మొత్తం (99) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ పిడి మధుసూదన రాజు, జడ్పీ సీఈఓ పురుషోత్తం, బీసి వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహ స్వామి, సిపిఓ సుబ్బారావు, డీహెచ్ఓ మరియన్న, గ్రాండ్ వాటర్ అధికారి వేముల సురేష్, డిఎఓ విజయ నిర్మల, అన్నీ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ అభిలాష అభినవ్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో 91.62 శాతం ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తిచేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల్లో భాగంగా మండల స్థాయి అధికారులు ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

కారేపల్లి ఎస్ఐ రాజారాం

విశాలాంధ్ర - కారేపల్లి : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం టాస్క్ ఫోర్స్ పోలీసులు కారేపల్లి పోలీసులతో కలిసి వలపన్ని రెండు లారీలలో ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కారేపల్లి పోలీస్ స్టేషన్కు తరలించారు. కారేపల్లి ఎస్ఐ ఎన్ రాజారామ్ అందించిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి సింగరేణి మండల పరిధిలోని పంతులు నాయక్ తండాలో ఒక లారీ(టీ ఎస్ 02టి 0009),బొలెరో(ఎపి 02 వై 3691) వాహనాలలో తరలించడానికి సిద్ధంగా ఉన్న288 క్వింటాల రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి స్వాధీనం చేసుకొని కారేపల్లి స్టేషన్ కు తరలించినట్టు తెలిపారు. ఇల్లందుకు చెందిన లారీ డ్రైవర్ సంతోష్,బొలెరో వాహనానికి చెందిన డ్రైవర్ భూక్య నాగరాజు ఈ ఇద్దరు డ్రైవర్లు కూడా సంబంధిత వాహన యజమానులే కావడం విశేషం. ఇల్లందు మండలం వేపలగడ్డకు చెందిన బియ్యం వ్యాపారి బానోతు కోటేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు

ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ ఐ రాజారాం అన్నారు. గ్రామాలలో అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రటరీ స్మితా సబర్వాల్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రామప్ప పర్యటక ప్రాంత అభివృద్ధి ప్రసాద్, సాస్కి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలనీ పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ స్మితాసబర్వాల్ అన్నారు. సోమవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా వెంకటపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్ప దేవాలయాన్ని పర్యాటక సాంస్కృతిక యువజనుల ఆర్కియాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ చేరుకోగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పూల మొక్కను అందచేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామప్ప దేవాలయం పరిధిలో జరుగుతున్న ప్రసాద్, సాస్కి ప్రాజెక్టుల పనుల గురించి కలెక్టర్ వివరించారు. రామప్ప దేవాలయానికి విచ్చేసిన పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ స్మితా సబర్వాల్‌కు దేవాలయ వేద పండితులు సంప్రదాయాల వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ రుద్రేశ్వరుడినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆలయ మండపంలోను పట్టు వస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ప్రసాద్ స్కీం ద్వారా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పార్కింగ్ ఇంటర్ప్రిటేషన్ సెంటర్ పనులను పర్యవేక్షించి, రామప్ప హరిత కాటేజ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా పర్యాటక సాంస్కృతిక శాఖ సెక్రెటరీ స్మితా సబర్వాల్ మాట్లాడుతూ యునెస్కో వరల్డ్ హెరిటేజ్ రామప్ప టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ లో భాగంగా గత సంవత్సరం 60 కోట్లు ప్రసాద్ స్కీమ్‌లో మంజూరైన పనులు, ఈ సంవత్సరం సాస్కి స్కీం ద్వారా 73 కోట్ల నిధులు మంజూరైన సందర్భంలో రామప్ప పరిసర ప్రాంతాల్లో పర్యాటకులకు ఏ విధమైన ఫెసిలిటీస్ ఉంటే ఎక్కువ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు ఉండాలని సలహాలు సూచనలు చేశారు. రామప్ప టెంపుల్‌లో సౌండ్ అండ్ లైట్ షో గురించి ఆర్కే లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో చర్చించి ఏ విధంగా లైట్ అండ్ సౌండ్ షో ఏర్పాటు చేయాలో, ఏప్పటివరకు చేస్తారనే విషయాలను చర్చించారు. అదేవిధంగా టెంపుల్‌లోని కళ్యాణ మండపం పనులను పరిశీలించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం హెరిటేజ్ డిపార్టెంట్ డైరెక్టర్ లక్ష్మీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఇంజనీర్స్ జనరల్ మేనేజర్ మరియు ప్రాజెక్టు కన్సల్టెంట్స్ సత్యనారాయణ మూర్తి క్షేత్ర కన్సల్టెన్సీ, కేంద్ర పురావస్తు శాఖ అధికారులు డాక్టర్ హెచ్ ఆర్ దేశాయ్, డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్, డాక్టర్ రోహిణి పాండే, అసిస్టెంట్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్, ఎం నవీన్ కుమార్, వరంగల్ సబ్ సర్కిల్ ఇంచార్జి, డైరెక్టర్ హెరిటేజ్ తెలంగాణ, రాములు నాయక్, డిప్యూటీ డైరెక్టర్ మల్లునాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ వరంగల్ నర్సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్, ఆర్డీఓ వెంకటేష్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఇంజనీర్స్ డిఈ ధనరాజ్ పాల్గొన్నారు.

నర్సింగ్ సిబ్బంది సేవలు ఉదారమైనవి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని వైద్యులను ప్రజలు దేవుళ్ళతో సమానంగా భావిస్తారని నర్సింగ్ సేవలు ఉదరమైనవని జిల్లా కలెక్టర్ జతేష్ పాటిల్ అన్నారు. ఐ.ఎం.ఎ హాల్లో ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1, గ్రేడ్-2 మరియు హెడ్ నర్సుల అభినందన సభలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఎంతో ఒత్తిడితో రోగులకు అందుబాటులో ఉంటూ సెలందిస్తూ రోగికి వైద్యునికి మధ్య అనుసంధానంగా వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న నర్సింగ్ సిబ్బంది సేవలను ఆయన కొనియాడారు. ఎన్ని వత్తిళ్లు ఉన్నా కూడా రోగికి వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తుంటారని తెలిపారు. వృత్తిలో భాగంగా ఎటువంటి సమస్యలు ఉన్న తానున్నానని వారికి భరోసా కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, జిల్లాలోని టివివిపి ఆసుపత్రుల డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ రాధా రుక్మిణి, డాక్టర్ సునీల్ మజ్నేకర్, డాక్టర్ హర్షవర్ధన్, జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా మోహన్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం హమాలీ కార్మికులను పట్టించుకోవాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా ప్రతినిధి : సివిల్ సప్లై జిసిసి హమాలీ కార్మికుల సమస్య ప్రభుత్వం పట్టించుకొని, పరిష్కరించాలని, ఏఐటీయుసి ములుగుజిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేటు కార్యాలయం ముందు ఏఐటీయుసి జిల్లా కమిటి ఆధ్వర్యంలో సివిల్ సప్లై సమస్యలు పరిష్కరించాలని, హమాలీలు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జంపాల రవీందర్ మాట్లాడుతూ పెంచిన హమాలీ చార్జీల జీవో విడుదల చేసి, హమాలీలు చేస్తున్న నిరవధిక సమ్మెను ప్రభుత్వం విరమింప చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల స్టాక్ పాయింట్ల వద్ద, హమాలీ కార్మికులు సోమవారం వరకు నిరవధిక నిరవధిక దీక్షలు ఆరువ రోజుకు చేరుకున్నాయని, ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయల వద్ద ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేసామన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరదకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనర్ యండి అంజధ్ పాష, సిపిఐ ములుగు మండల కార్యదర్శి ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, తెలంగాణ సివిల్ సప్లై జిసిసి హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కేతపాక సుమన్, ప్రధాన కార్యదర్శి ధానం భిక్షపతి, ఉపాధ్యక్షులు పోదెం రమేష్ హమాలీ కార్మికులు రొంటాల రమేష్, మొలుగూరి రాంబాబు, లెంకలపెల్లి రాజు, ఇనుముల భిక్షపతి, ఇనుముల రఘుపతి, యాటల పైడి, వెల్దండి కొమురయ్య,మాటేటి కుమార్, గాడిచర్ల బాబు, పాశికంటి శ్రీధర్, బొద్దుల రాజు, పదాల రామక్రిష్ణ, కుర్సం రాంబాబు, పసుపులేటి గిరిబాబు, కుర్సం వెంకటేశ్వర్లు, పోలం రవి, గగ్గూరు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వాసవి వనిత క్లబ్బుల సభ్యత నమోదు సేకరణ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్లలోని వాసవి వనిత క్లబ్బులు సోమవారం సభ్యత సేకరణను ప్రారంభించారు. స్థానిక అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో ఉగ్రదండి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సభ్యత నమోదు సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్. వాసవి క్లబ్బు అధ్యక్షుడు ఈగ శ్రీనివాసరావు. ప్రధాన కార్యదర్శి ఏకే సుమంత్. కోశాధికారి నకిరేకంటి వంశీ. వనిత క్లబ్ అధ్యక్షురాలు కట్టమూరి విజయ. ప్రధాన కార్యదర్శి గరిణె జ్యోతి. కోశాధికారి చెరుకు కవిత. మాజీ అధ్యక్షులు గోళ్ళ సుధాకర్. కందిబండ శ్రీనివాసరావు. ఊటుకూరి నటరాజ్. గెల్లి లక్ష్మీనరసింహారావు. వాసవి క్లబ్ సభ్యులు పోలిశెట్టి వెంకటేశ్వర్లు. మాశెట్టి సైదయ్య. చందా కిషన్. చెరుకు రాము. వనితా క్లబ్ మాజీ అధ్యక్షురాలు గెల్లి లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి : రామగుండం కార్పొరేషన్ పరిధి కాశిపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిని ప్రోత్సహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖనిలో టౌన్ ప్లానింగ్ అధికారుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మార్కాపురం సూర్య మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఫిర్యాదులు చేసినా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆరేపల్లి మానస్ కుమార్ నగర కార్యదర్శి ఆశాల నవీన్ నాయకులు రాణవేణి సుధీర్, వినయ్, పోతరాజు నాగరాజు, నాగరాజు, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

విశాలాంధ్ర - గార్ల : పంటచేలనే పరిశ్రమలుగా భావించి శ్రమించే రైతన్నలు విత్తనాలు కొనే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వ్యవసాయాధికారి కావటి రామారావు అన్నారు. సోమవారం మండలంలోని సీతంపేట గ్రామంలో ప్రభాకర్ హైబ్రిడ్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిర్చి పంట క్షేత్ర పరిశీలనలో పాల్గొని మాట్లాడారు. శివమ్ మిర్చి రకం అధిక దిగుబడి, అత్యధిక రాబడి ఇస్తుందన్నారు. సన్న రకం, ముదురు ఎరుపు రంగులో ఉండి అధిక ఘాటు కలిగి, ఆయిల్ శాతం ఎక్కువగా వస్తున్నట్లు చెప్పారు. వీటి మొక్కలు, కొమ్మలు దృఢముగా వ్యాపించే రకమన్నారు. ఎకరానికి సుమారు 35 క్వింటాలు దిగుబడి వస్తుందని తెలిపారు. ఎప్పటికైనా రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. విత్తనం కాయ సైజు, ఎరుపు రంగు కలిగి ఉండడం ఇక్కడ నేలలకు చాలా అనువుగా ఉంటుందన్నారు. రైతులు విజయవంతమైన సాగు కోసం సరైన మిరప రకాన్ని ఎంచుకోవాలని కోరారు. అద్భుతమైన వ్యవసాయ నిర్వహణ ఉన్నప్పటికీ నాణ్యత లేని మిరప విత్తనాలు తక్కువ రైతులకు గుదిబండగా మారాయన్నారు. నకిలీ విత్తన విక్రయం దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ హైబ్రిడ్ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కిరీటి రీజినల్ మేనేజర్ ద్వారకానాథ్, సేల్స్ ఆఫీసర్ గంట కృష్ణ, ఖమ్మం జిల్లా డిస్ట్రిబ్యూటర్ న్యూ శ్రీకృష్ణ ఎంటర్ ప్రైజెస్ లింగాల ఉమేష్, నాగ మహేశ్వర ఎంటర్ ప్రైజెస్ లింగాల మహేష్, గ్రామాల రైతులు సుమారు 800 మంది పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్

విశాలాంధ్ర- ముదిగొండ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని ముదిగొండ శివారులోని హైవే వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇసుకలోడుతో లారీలు వచ్చాయి. ఇసుక లోడుతో లారీలు వచ్చాయి. వీరి వద్ద తనిఖీ చేయగా ఇసుక తరలించడానికి అనుమతి పత్రాలు లేకపోవడంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి డ్రైవర్ను అదుపులోకి తీసుకొని లారీలను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ లారీలు ఆంధ్రా నుంచి ఇసుకను తరలిస్తున్నట్లుగా గుర్తించారు. అంతర రాష్ట్ర ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవని ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమురం భీం : సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ మండలంలోని కుటోద గ్రామంలోని భీమయ్యక్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద రూ. 2.5 లక్షలతో ఏర్పాటుచేసిన నీటి సరఫరా విద్యుత్ మోటార్‌ను ప్రారంభించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన కమిటీ ఏర్పాటుచేసిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని విద్యపై దృష్టి సారించాలని సూచించారు.

ఖమ్మంలో కాంగ్రెస్ ర్యాలీ...

విశాలాంధ్ర - ఖమ్మం : ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ మాజీ ఎంపీ, ఢిల్లీ అసెంబ్లీ కల్కాజీ బీజేపీ అభ్యర్థి రమేష్ బిధూరి ప్రియాంక గాంధీ వాద్రాపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మహిళల ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి బీజేపీ ఎంపీ, ఢిల్లీ అసెంబ్లీ కల్కాజీ బీజేపీ అభ్యర్థి రమేష్ బిధూరి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్ ముక్తార్‌లు మాట్లాడుతూ బీజేపీ నాయకులకు మహిళలంటే చిన్న చూపు చూస్తుందని, ఇప్పటికైనా అనుచిత వాఖ్యలు చేసిన అభ్యర్థి టికెట్‌ను రద్దు చేయాలని రానున్న రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని బీజేపి ప్రభుత్వం మహిళలకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా ఓ బి సి, కిసాన్ కాంగ్రెస్, ఎస్సీ సెల్, సేవాదళ్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ గౌస్, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వర్లు, పల్లెబోయిన భారతి చంద్రం, కన్నం వైష్ణవిప్రసన్న, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జెల్లి వెంకన్న, గజ్జి సూర్యనారాయణ, భవాని, ప్రత్తిభారెడ్డి, రమాదేవి, జ్యోతి, లక్ష్మి, నాగమణి, నీలవేణి, సుగుణ, ఉమాదేవి, జ్యోష్ణ, సమీరా, రహేమా, వాసిం, గద్దం వెంకటయ్య, మహమూద్, సంపటం నరసింహారావు, నూకారపు వేంకటేశ్వరరావు, బండి నాగేశ్వరరావు, జహీర్ భాయ్, రజి భాయ్, యశ్వంత్, సాయి, సురేష్ నాయక్, జాని, పాషా, మందపల్లి నాగమణి, తూములూరి లక్ష్మీ నరసింహారావు, ఏలూరి రవి కుమార్, కిలారి అనిల్, దొడ్డా ప్రవీణ్, జెర్రిపోతుల అంజనీ కుమార్, బచ్చలికూర నాగరాజు, బోడేపూడి రాజా,పర్వత శ్రీనివాస్ పాల్గొన్నారు.

అరిష్ గ్లోబల్ సర్వీసెస్‌తో వెర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ భాగస్వామ్యం

హైదరాబాద్: ఇటీవలి డేటా ప్రకారం, భారతదేశంలోని ఐటీ-బీపీఎంరంగం మార్చి 2023 వరకు 5.4 మిలియన్ల మందికి పైగా ఉపాధి కల్పించింది. ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి, దేశంలోని యువతకు సాధికారత కల్పించడానికి, టమ్స్ స్క్వేర్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన వెర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ యూకేకు చెందిన అరిష్ గ్లోబల్ సర్వీసెస్‌తో తన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం రాబోయే మూడేళ్లలో 5000 ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఔట్‌సోర్సింగ్ పరిశ్రమలో వెర్టెక్స్ స్థితిని బలోపేతం చేస్తుంది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బీపీఎం కంపెనీలలో ఒకటిగా వెర్టెక్స్ గ్రూపు ముఖ్యంగా కస్టమర్ సర్వీస్, ఐటీ సపోర్ట్, డేటాప్రాసెసింగ్, ఫైనాన్స్, బ్యాక్-ఆఫీస్ కార్యకలాపాల వంటి రంగాలలో ఉపాధిని సృష్టించడం ద్వారా భారతీయ, అంతర్జాతీయ సంస్థల కోసం కస్టమర్ అనుభవాలను మార్చడానికి కట్టుబడి ఉంది.

ఇస్రో తోడ్పాటుతో చరిత్ర సృష్టించిన ఎంఐటి-డబ్ల్యూపియూ

పూణే: ఎంఐటి వరల్డ్ పీస్ యూనివర్సిటి (ఎంఐటి-డబ్ల్యూపియూ), పూణె, వద్ద స్పేస్ టెక్నాలజీ రిసెర్చ్ గ్రూప్ (ఎస్‌టిఈఆర్‌జి) తన మొట్టమొదటి స్పేస్ పేలోడ్, ఎస్‌టిఈఆర్‌జి-పి1.0ను ప్రారంభించింది. ఇస్రో సహకారంతో విదేశాలలో ప్రారంభించబడిన పిఎస్ఎల్‌వి-సి60, ఈ పేలోడ్ విశ్వవిద్యాలయానికి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. భారతదేశపు అంతరిక్ష పరిశోధన ప్రయత్నాలకు దోహదపడుతుంది. ఎలెక్ట్రికల్, ఎలెక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంనుండి విద్యార్థులు, ఫాకల్టీలు రూపొందించిన, అభివృద్ధి చేసిన ఈ పేలోడ్, తన కాస్ట్-ఎఫెక్టివ్ అంతరిక్ష సాంకేతికతలో ఒక ముఖ్యమైన పురోగతిని సూచిస్తుంది. ఎంఐటి-డబ్ల్యూపియూ విద్యార్థులు చరిత్ర సృష్టించడంలో ఫాకల్టి సభ్యులు, ఎంఐటి-డబ్ల్యూపియూ తిరుగులేని మద్దతుతోపాటు ప్రొ. డా. మూర్తి చావలి యాదవ్ నైపుణ్య మార్గదర్శనం కీలకపాత్ర పోషిస్తుండగా ఈ మిషన్ విజయం ప్రతిభావంతులైన విద్యార్థుల సమష్టి కృషి ఫలితంగా లభించింది.

నెట్‌ఫ్లిక్స్ వారి స్క్విడ్ గేమ్ సీజన్ 2తో సీగ్రమ్స్ రాయల్ స్టాగ్ సెలబ్రేషన్

న్యూఢిల్లీ: సీగ్రమ్స్ రాయల్ స్టాగ్, ప్రేక్షక అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నెట్‌ఫ్లిక్స్ వారి రికార్డ్-బ్రేకింగ్ సిరీస్ 'స్క్విడ్ గేమ్' రెండవ సీజన్ కోసం కొలాబరేట్ చేసింది. ఈ కొలాబరేషన్, రాయల్ స్టాగ్ వారి 'లివ్ ఇట్ లార్జ్' సిద్ధాంతాన్ని సునాయాసంగా మేళవించి, ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమందిని సమ్మోహితులను చేసిన అంతర్జాతీయ గ్లోబల్ కల్చరల్ ఒరవడిలో ప్రేక్షకులకు ఒక లార్జర్-దాన్-లైఫ్ అనుభవాన్ని అందించింది. కే-డ్రామా, యువతరాన్ని ఎంతగానో ఆకట్టుకుంటున్నది. అందువలన, సాంస్కృతికంగా వర్తించే యువజనులను ఆకట్టుకునే విషయాలపై ప్లే చేయగలిగేందుకు ఈ అనుబంధం, బ్రాండుకు వీలు కల్పిస్తుంది. తద్వారా అనుబంధం, ఆశయాలను కూడా డయల్ అప్ చేయగలుగుతుందని జనరల్ మేనేజర్-పెర్నాడ్ రికార్డ్ ఇండియా జోయ్‌దీప్ బసూరాయ్ అన్నారు.

ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ-థింక్ గ్యాస్ ఫ్యూయల్ కార్డ్ విడుదల

హైదరాబాద్: స్వచ్ఛమైన ఇంధన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి, అసాధారణమైన కస్టమర్ అనుభవాలను అందించడానికి కట్టుబడి ఉండటంతో పాటుగా, దాని ఫీచర్ ప్యాక్డ్ మైలేజ్ సీఎన్‌జీ ఫ్యూయల్ కార్డ్‌ను ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ-థింక్ గ్యాస్ జాగెల్ భాగస్వామ్యంతో విడుదల చేసింది. ఈ కార్డును మల్టీ-సిటీ లైవ్ ఈవెంట్‌లో సీనియర్ నాయకత్వం సమక్షంలో ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ-థింక్ గ్యాస్, చైర్మన్ అమితవ సేన్‌గుప్తా విడుదల చేశారు. అత్యుత్తమ శ్రేణి భద్రతా ఫీచర్‌లతో సౌకర్యవంతమైన, సురక్షితమైన కస్టమర్ అనుభవాన్ని ఈ వినూత్న కార్డ్‌తో, కస్టమర్‌లు ఆస్వాదించవచ్చు. ఈ కార్డ్ ఇంధన, సురక్షితమైన, సౌకర్యవంతమైన నగదు రహిత చెల్లింపుల కోసం రీడీమ్ చేయదగిన క్యాష్‌బ్యాక్‌ను అందిస్తుంది, ఒకే మాస్టర్ ఖాతాను ఉపయోగించి తమ మొత్తం ఫ్లీట్‌ను పర్యవేక్షించడానికి నిర్వాహకులకు వీలు కల్పిస్తుందని ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ-థింక్ గ్యాస్ చైర్మన్ అమితవ సేన్‌గుప్తా అన్నారు.

బేయర్ ఏజి నుండి క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ ఇథోక్సిసల్ఫ్యూరాన్ సేకరణ

న్యూఢిల్లీ: క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్, వ్యవసాయ ఆవిష్కరణలలో అగ్రగామిగా ఉంది. కొన్ని ఆసియా దేశాలలో విక్రయాల కోసం బేయర్ ఏజీ నుండి క్రియాశీల పదార్థం ఎథోక్సిసల్ఫ్యూరాన్ గ్లోబల్ కొనుగోలును ప్రకటించింది. ఈ సముపార్జన క్రిస్టల్ యొక్క 13వ వ్యూహాత్మక లావాదేవీగా, 2021లో ఇండియన్ కాటన్, పెరల్ మిల్లెట్, మస్టర్డ్ సీడ్ పోర్ట్‌ఫోలియోను కొనుగోలు చేసిన తర్వాత బేయర్ నుండి రెండవ కొనుగోలుగా గుర్తించబడింది. ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సి) ద్వారా మద్దతు పొందిన, క్రిస్టల్ క్రాప్ అనేది ఆర్ అండ్ డి ఆధారిత పంటల పరిష్కార కంపెనీ, ఇది గత 4 దశాబ్దాలుగా ఆధునికమైన, రైతు- కేంద్రీయంగా పరిష్కారాలను అందిస్తోంది. ఇది క్రిస్టల్ వారి అతి పెద్ద సేకరణ, వరి కలుపునాశిని మార్కెట్‌లో తమ నాయకత్వానికి మద్దతునిస్తూనే తమ ఈబీఐటీడీఏను 20 శాతం పెంచుతుంది. ఈ లావాదేవీ అన్ని రిజిస్ట్రేషన్‌లతో పాటు విశ్వసనీయమైన సన్‌రైస్ ట్రేడ్‌మార్క్ ఇథాక్సిసల్ఫ్యూరాన్ కలిగిన మిశ్రమ ఉత్పత్తిని అందిస్తుంది.

ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్ట్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగిణి తస్కరిస్తున్న నలుగురు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. కొత్తగూడెం టూ టౌన్ సీఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామవరంలోని టూ టౌన్‌తో సహా వన్ టౌన్, సుజాతనగర్, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపరెడ్డి పల్లి, టేకులపల్లి మండలాల్లోని పంట పొలాల్లో ఉన్న రైతులకు సంబంధించిన ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫార్మర్లను ఇటీవల కాలంలో దొంగలించారు. ట్రాన్స్ఫార్మర్లను పగలగొట్టి అందులో ఉన్న రాగి నీ అమ్ముకుని జల్సాలు చేస్తున్నట్టు వివరించారు. రామవరం ఏరియా సీఆర్పీ క్యాంపు చెందిన దీపక్ పాసి, వెంగళరావు కార్మికు చెందిన భూక్య హుస్సేన్, పోలింగ్ 4 ఇంక్లైన్ గ్రామానికి చెందిన బోధనపు సులేమాన్, రామవరం 7 నెంబర్ బజార్‌కు చెందిన గట్టు కిరణ్ కుమార్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సీఐ చెప్పారు. రాంపురం గ్రామ శివారులోని ఒక ట్రాన్సుర్‌ని పగలగొట్టి దొంగలించే క్రమంలో ఇందులో మరో వ్యక్తి 2 ఇంక్లైన్‌కు చెందిన తమ్మ నిరంజన్ ఎలక్ట్రిక్ షాక్ తగిలి చనిపోవడం జరిగిందన్నారు. దీంతో నిరంజన్‌ను తీసుకెళ్లి గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్పించి అక్కడి నుంచి పారిపోవడం జరిగిందన్నారు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులు ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక టీం ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. సోమవారం పెనగడప గ్రామ శివారులోని చంద్రుకుంటా క్రాస్ వద్ద నలుగురిని పట్టుకోవడం జరిగిందన్నారు. వారి నుంచి రెండు ఆటోలు, 15 కేజీల రాగి వైరును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు తెలిపారు.

తుది ఓటర్ల జాబితా విడుదల : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, సూచనల ప్రకారం, ప్రత్యేక సవరణ- 2025 లో భాగంగా మెదక్ జిల్లా పరిధిలోని మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సోమవారం విడుదల చేశారు. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో 278 పోలింగ్ స్టేషన్లుండగా, 1,04917 మంది పురుషులు, 1,15987 మంది మహిళలు, నలుగురు థర్డ్ జెండర్, మొత్తం 2,20,908 మంది సాధారణ ఓటర్లున్నారు. వీరిలో 9 మంది పురుషులు, 1 మహిళ ఎన్ఆర్ఐ ఓటర్లు మొత్తం 10 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లలో 87 మంది పురుషులు, ఇద్దరు మహిళలు కలిపి 89 మంది ఉన్నారు. నర్సాపూర్‌లి అసెంబ్లీ నియోజకవర్గంలో 308 పోలింగ్ స్టేషనన్లుండగా 1,11611 మంది పురుషులు, 1,18,701 మంది మహిళలు, అయిదుగురు థర్డ్ జెండర్ మొత్తం 2,30,317 సాధారణ ఓటర్లున్నారు.

సంపాదకీయం

హైందవ శంఖారావం

ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం దగ్గర్లోని కేసరపల్లి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆదివారం బ్రహ్మాండమైన సభ నిర్వహించింది. సభ ఎంత బ్రహ్మాండంగా జరిగింది అన్న విషయంలో ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు. కానీ అ సభ వెనక ఉన్న ఉద్దేశాన్ని, లక్ష్యాన్ని, అంతిమంగా సమాజం మీద ఇలాంటి సమావేశాల ప్రభావం ఎలా ఉంటుందో మాత్రం చర్చించాల్సిందే. దీన్ని హైందవ శంఖారావం అంటున్నారు. ఈ శంఖారావం దేని కోసం? ఏ సమరం కోసం? ఏ లక్ష్య సాధన కోసం. ఈ సభలో చేసిన హిందూ మత పెద్దల ప్రసంగాలను బట్టి చూస్తే 1987నాటి దేవాదాయ, ధర్మాదాయ చట్టాన్ని రద్దుచేసి హిందూ దేవాలయాల నిర్మాణ బాధ్యత హిందువులకే అప్పగించాలని కోరడానికి అని అర్థం అవుతూ ఉంది. ఇస్లాం, సిక్కు, జైన, బౌద్ధ దేవాలయాల నిర్వహణ బాధ్యత ప్రభుత్వం చేతిలో లేనప్పుడు హిందూ దేవాలయాల మీద మాత్రమే ప్రభుత్వ పెత్తనం ఎందుకు ఉండాలి అన్న ప్రశ్న పైపైన చూస్తే చాలా సమంజసమైందిగానే కనిపిస్తుంది. దక్షిణాదిలోని అయిదు రాష్ట్రాలలో దేవాలయాలకు రాజులు, జమీందార్లు ఇచ్చిన భూమి పది లక్షల ఎకరాల దాకా ఉండేదని ఉత్తరాదికి చెందిన ఒక స్వామి అంటే కాదు ఒక్క తెలుగు రాష్ట్రాలలోనే 15 లక్షల ఎకరాలు ఉండేదని అది ఇప్పుడు నాలుగున్నర లక్షల ఎకరాలకు కుంచించుకు పోయిందని చిన జీయర్ స్వామి అంటున్నారు. దేవాలయాల నిర్మాణం ప్రజల అధీనంలోనే జరిగి ఉండొచ్చు. కానీ ప్రాచీన కాలంలో అయితే రాజుల, బడా భూస్వాముల ఆదరణ, భూములు-నగలు ఇవ్వనిదే ఏ దేవాలయ నిర్మాణమూ జరగలేదు. అంటే రాజాశ్రయం లేకుండా దేవాలయాలు నెలకొనలేదు. అభివృద్ధి చెందనూ లేదు. దేవాలయాల ఆదాయంలో కొన్ని సందర్భాలలో ప్రభుత్వానికి 12 శాతం చెల్లించవలసి వస్తోందని, తిరుమల తిరుపతి దేవాలయం 7 శాతం ప్రభుత్వానికి చెల్లిస్తోందని ఈ శంఖారావ సభలో మాట్లాడిన మఠాధిపతులు, సాధువులు, సంతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు సర్వ శ్రేయోనిధి, ఆడిట్ ఖర్చులు, ఎగ్జిక్యూటివ్ అధికారి, ఇతర సిబ్బంది జీత నాతాలు కూడా దేవాలయాలకువచ్చే ఆదాయం నుంచే భరించవలసి వస్తోందన్న ఆవేదన కూడా వ్యక్తం అయింది. కొంచెం లోతుగా పరిశీలిస్తే ఆస్తులు, భారీ ఆదాయం ఉన్న ఆలయాలు ఎవరి అధీనంలో ఉండాలన్నదే పెద్ద ప్రశ్నగా తయారైందనిపిస్తోంది. హైందవ శంఖారావంలో ప్రసంగాలను పరిశీలిస్తే ఆలయాలు హిందువుల చేతిలో ఉండాలన్న భావన స్పష్టంగానే వ్యక్తం అయింది. ముస్లింల దండయాత్రల కాలంలో దేవాలయాలను ధ్వంసం చేయడం కేవలం సంపద కోసం మాత్రమే కాదని, హిందువుల అస్తిత్వాన్ని దెబ్బ తీయడానికేనన్న అభిప్రాయం వ్యక్తంచేసిన ప్రసంగాలూ ఈ శంఖారావ సభలో వినిపించాయి. అంటే హిందువులకు భద్రత కరువైంది అన్న మోదీ లాంటి వారి వాదనల ప్రతిధ్వని ఈ సభలో కూడా వినిపించింది. అర్చక వృత్తి వంశపారంపర్యంగానే సాగాలని, అర్చకులకు బదిలీలు, పదవీ విరమణ లాంటివి ఉండకూడదనీ అన్నారు. అర్చకత్వం ఎవరి చేతుల్లో ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. చాలా కొద్ది చోట్ల అర్చకత్వం బ్రాహ్మణేతరుల చేతిలో ఉంటే ఉండవచ్చు. సమాజంలోని కింది వర్ణాల వారు ఆరాధించే దేవాలయాల్లో బ్రాహ్మణుల అర్చకత్వం ఉన్న సందర్భాలు తక్కువే కావచ్చు. కానీ పుష్కలమైన ఆదాయ వనరులున్న దేవాలయాలలో బ్రాహ్మణేతరులు అర్చకులుగా ఉన్న సందర్భాలున్నాయా అన్నది పెద్ద ప్రశ్నే. విశ్వ హిందూ పరిషత్ అధ్వర్యంలో జరిగిన హైందవ శంఖారావ సభ అన్ని రాష్ట్రాలలోనూ దేవాలయాల మీద ప్రభుత్వ పెత్తనానికి స్వస్తి చెప్పి హిందువులకు అప్పగించాలన్న మాట గట్టిగానే వినిపించింది. ఆ హిందువులు ఏ వర్గం వారు అన్న ప్రశ్న కచ్చితంగా తలెత్తుతుంది.

ఈ సభలో శోభా యాత్రల మీద ఆంక్షలు ఉండకూడదని వాదించారు. మతం వ్యక్తిగత వ్యవహారం అయినప్పుడు, సామూహిక ఆరాధన, ఊరేగింపులు జరిగినప్పుడు అవి శాంతియుతంగా జరిగితే నిజానికి ఆంక్షల అవసరమే ఉండదు. కానీ బెంగాల్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో మొన్నటికి మొన్న సంభల్‌లో హిందువుల శోభా యాత్రల, ఊరేగింపుల సందర్భంగా ఇతర మతాల వారి మీద, ముఖ్యంగా ముస్లింల మీద జరిగిన దాడులు, రెచ్చగొట్టే కార్యకలాపాలను ఎలా విస్మరించగలం! ఈ కవ్వింపు చర్యలకు కారకులైన వారిని చూస్తూ కళ్లు మూసుకోవాలా? ఆలయాల సంరక్షణ, ఆలయాలమీద ప్రభుత్వ పెత్తనం ఏమిటి అని ప్రశ్నిస్తున్న వారు వివిధ రంగాలలో పనిచేస్తున్న హిందూ శ్రమజీవుల కష్ట సుఖాలు పట్టించుకున్న ఉదంతాలు ఉదాహరణ ప్రాయంగా కూడా లేవు. దాదాపు నాల్గేళ్లుగా రైతులు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనా క్రమంలో 700 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. విశ్వ హిందూ పరిషత్ సంఘ్ పరివార్ కుదురులో భాగమే. కానీ విశ్వహిందూ పరిషత్ మాత్రమే కాకుండా సంఘ్ పరివార్‌లోని ఏ విభాగమైనా ఈ రైతుల గోడు పట్టించుకున్న దాఖలాలే లేవు. రైతుల ఆదాయం 2022 కల్లా రెట్టింపు చేస్తాం అని మోదీ ఇచ్చిన హామీ గంగలో కలిస్తే సంఘ్ పరివార్ కుదురులోని వారు పల్లెత్తు మాట అనలేదు. నిరుద్యోగులలో హిందువులే అత్యధికులు కారా? పని గంటలను పెంచితే ఆ భారం హిందూ కార్మికుల మీద పడదా? ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటుకు తెగనమ్ముతూ ఉంటే నష్టపోయే వారిలో హిందువులు లేరా? దళిత భజగోవిందం పేరిట దళిత వాడల్లోనూ రామాలయాలు నిర్మిస్తున్నారు కాని ఉన్న ఆలయాల్లో దళితులకూ ప్రవేశం ఉండాలని విశ్వహిందూ పరిషత్ గొంతెత్తిన ఉదాహరణ ఎందుకు కనిపించదో! 1987లో ఆమోదించిన చట్టానికి వ్యతిరేకంగా ఈ శంఖారావం పూరించినట్టు భ్రమ కలిగించే ప్రయత్నాలు శంఖారావ సభలో చాలానే జరిగాయి. 1987నాటి చట్టం కూడదంటున్నవారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 1996లో సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శక సూత్రాలు జారీ చేసింది. వీటిని అమలు చేయాలని శంఖారావ సభలో కోరితే ఎవరికీ అభ్యంతరం ఉండనక్కర్లేదు. కానీ కేసరపల్లి సభలో వినిపించిన కొన్ని నినాదాలు ఈ సభ అసలు లక్ష్యం ఏమిటో తెలుస్తూనే ఉంది. హిందూ ఆలయాల రక్షణకు కంకణబద్ధులమై ఉంటామని వచ్చిన జనం చేత చిన జీయర్ స్వామి ఓ ప్రతిజ్ఞ కూడా చేయించారు. ఇదే వేదిక నుంచి అఖండ భారత్, గో సంరక్షణ, భారత దేశాన్ని హిందూ రాష్ట్రంగా ప్రకటించాలి అన్న నినాదాలూ వినిపించాయి. హిందుత్వ భావాలు ప్రేరేపించే ప్రయత్నం చాలా స్పష్టంగా ఈ సభలో కనిపించింది. హిందుత్వను మరింత బలోపేతం చేయడమే ఈ సభ లక్ష్యంగా కనిపించింది. దీనికి పరిస్థితిని సానుకూలం చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అని చెప్పడానికి మొహమాట పడనక్కర్లేదు. 1998లో బీజేపీ ఉమ్మడి రాష్ట్రంలో నాలుగు లోక్‌సభ స్థానాలు, 1999లో ఏడు స్థానాల్లో విజయం సాధించింది. తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తుతం బీజేపీ సభ్యులు ఎనిమిది మంది, ఆంధ్రప్రదేశ్‌లో ఎనిమిది మంది ఉన్నారు. ఇదీ చంద్రబాబు చలవేగా! అవి కచ్చితంగా ప్రమాద సంకేతాలే.

అమాయకులు

చింతపట్ల సుదర్శన్

ఆకాశంలో సూర్యుడు ఒక్కడే ఉన్నాడు. ఒంటరిగా అరుగుమీద డాగీ ఒక్కడే ఉన్నాడు ఒంటరిగా. అప్పటికే, డాంకీ నాలుగు కాళ్లమీద బానెడు పొట్టని మోసుకుంటూ వెళ్లిపోయింది. రెక్కాడితే కాని డొక్కాడదు కదా ఇంక బయలుదేరుదాం అని డాగీ అనుకుంటుంటే, అరుగు దగ్గర ఓ మనిషి కనపడ్డాడు. కొత్త మనిషి కనబడగానే అరిచి తీరాలని డాగీల ముఖాన రాసున్నది కదా అనుకున్న డాగీ అరుపు మొదలుపెట్టింది. ఆ మనిషి భయపడి పారిపోలేదు. చేత ఉన్న సంచీలోంచి బ్రెడ్డు ప్యాకెట్ తీసి అరుగుమీద పెట్టి వెళ్లిపోయేడు.

ఆశ్చర్యంతో అరవడం మరిచిపోయి, బ్రెడ్డు ప్యాకెట్‌ని చించి, చీలికలుచేసి, అవురావురంటూ బ్రెడ్డు మొత్తం తినేసి, ఈ రోజుకింక బయల్దేరే పనేలేదు అనుకుంటూ ఎక్కడ నిద్ర లేచిందో అక్కడేపడి నిద్రపోయింది డాగీ.

ఆ మర్నాడు కూడా అది అరుగు దిగలేదు. నిన్న వచ్చిన నరుడే మళ్లీ ఓ బిస్కెట్ ప్యాకెట్ అరుగుమీద పెట్టి వెళ్లాడు. ఆ తెల్లవారి కూడా డాగీకి పొట్టకోసం తిప్పలుపడే పనిలేకుండా పోయింది. మొదటిరోజు ఆ మనిషిని చూసీ చూడగానే అరుపు మొదలెట్టిన డాగీ, ఇప్పుడు వినయంగా తోక ఊపడం మొదలుపెట్టింది. నాలురోజులు గడిచేయో లేదో ఆ మనిషి రాకకోసం ఎదురుచూడ్డం, కనిపించగానే లేచి ఉత్సాహంగా తోక ఊపడం, మరచిపోకుండా అరుగు చివరకు వెళ్లడం మొదలుపెట్టింది. రోజూ

రంగస్థలం

ఏదోఒకటి తినడానికి తెచ్చి అరుగుమీద పెడ్తున్న మనిషి డాగీ మెడ మీద చేయి వేసి రాయడం, చనువుగా దాని ముఖాన్ని చేత్తోపట్టుకుపైకిలేపడం మొదలుపెట్టాడు. రోజూ వెజిటేరియన్ ఫుడ్డు తిండం కొంచె బోర్‌గానే ఉంది కానీ ఏదో ఓ రోజు మటన్ పెట్టకపోడు నా రక్షకుడు, ఇది ఏ జన్మ సంబంధమో, ఎన్నెన్ని జన్మల అనుబంధమో అనుకోసాగింది డాగీ. ఇది ఇలాగ జరుగుతున్న సంగతి డాంకీకి తెలీనేలేదు. హాయిగా కడుపులో పేగులు అరవకుండా ఉన్న డాగీ చెప్పనూలేదు. ఒకానొకనాడు మనిషి తన కోసం తెచ్చిన తిండి పరవశంగా తింటుంటే, మనిషి దాని మెడకుతాడు బిగించి అరుగుమీది నించి క్రిందికి దించి తన వెంటలాక్కుపోయేడు.

ఆ సాయంత్రం డాంకీకి డాగీ కనపళ్లేదు. ఆ రాత్రి రాలేదు. మర్నాడు కూడా కనిపించలేదు. ఎక్కడికి పోయిందిది నన్ను ఒంటరివాణ్ని చేసింది అంటూ బెంగపడసాగింది డాంకీ. రెండురోజులు గడచిపోయి, మూడవనాడు సాయంత్రం డాంకీ, 'డాగీ రాదా ఇక రానే రాదా' అని విచారపడుతుంటే అరుగు ఎక్కాడు అబ్బాయి. ఒంటరిగా ఉన్న డాంకీని చూసి డాగీ ఏదీ అనడిగాడు అబ్బాయి. మనిషైతే భోరున ఏడ్చేది డాంకీ కానీ నవ్వూ, ఏడుపూ మనుషులకే కేటాయించాడు కదా 'మేకర్'. బాధని వ్యక్తంచేసే మూలుగు మూలిగి విషయం వివరించింది డాంకీ. మున్సిపాలిటీ వాళ్లు వ్యాన్‌లో వేసుకుపోయారేమో అని అబ్బాయి అంటూనే ఉన్నాడు. ఎక్కణ్నించో నాలుక్కాళ్ల మీద గుర్రంలా గ్యాలపింగ్ చేస్తూవచ్చి అరుగు ఎక్కిన డాగీ ఆయాసం తీరడంకోసం డొక్క లెగరేసింది. అది స్తిమితపడ్డాక అడిగారు డాంకీ, అబ్బాయి... అసలు ఏం జరిగిందని? డాగీ ఎక్కడికి వెళ్లిపోయిందని.

అంతా నా తలరాత. నమ్మి మోసపోయేను. ఆ మనిషి నాలుగురోజులు తిండిపెట్టి, నా మెడకు తాడు చుట్టి తీసుకెళ్లాడు వాడి ఇంట్లో పిల్ల రాక్షసులు నా చెవులు పట్టి లాగారు. తోక లాగి ఆడారు. తిండి తిన్న విశ్వాసం కదా. నోరుమూసుకున్నాను. ఆ రాక్షసప్పిల్లలు, కుక్క కావాలని మారాం చేస్తే, ఖరీదైన జాతి కుక్కను కొనలేక నన్ను లాక్కెళ్లాడా మనిషి. పైగా నాలుగురోజులు పిల్లకాయలు నాతో ఆడుకుని మోజుతీరాక, నన్ను బయటికి గెంటి వేయవచ్చని ఇల్లాలుతో చెప్తుంటే విన్నాను. మనకు భాష తెలుసని తెలీక వాగాడు. ఇదా సంగతని తెలిశాక క్షణం ఉండలేక, కట్టు తెంచుకుని పరుగెత్తుకువచ్చా అంది డాగీ.

ఇదికాదా విషయం అని నవ్వాడు అబ్బాయి. ఇప్పుడు దేశం అంతా జరుగుతున్న తంతు ఇదే. 'ఉచితాలు' అంటూ ఊదరగొట్టి, మనుషుల మెడలువంచి ఓట్లు వేయించుకుంటున్నారు. నాలుగు రొట్టె ముక్కలకోసం, రెండు బిస్కట్లు కోసం ఆశపడ్డ నీలాగే లక్షలాది మంది జనం ఉచిత పథకాల గాలానికి చిక్కి రౌడీల్ని, కేడీల్ని, దగాకోరుల్నీ, జైళ్ల కెళ్లి వచ్చిన వాళ్లని ఎన్నుకుని ఆ తర్వాత బిక్కమొగం పెడ్తున్నారు అన్నాడు అబ్బాయి. అవునవును ఈ ఉచిత పథకాలు పేదవాళ్ల కోసంకాదు, పెద్దవాళ్లు పెద్దవాళ్లవడం కోసమేనని, ఉచిత పథకాలవల్ల నిజంగా లాభపడేది ఎన్నికయ్యేవాళ్లేనని ఏదో పేపర్లో నమిలాను అంది డాంకీ.

గెల్చిన ప్రతి నాయకుడూ పదవిని కాపాడుకోడానికి, మళ్లీ వచ్చే ఎన్నికలలో మళ్లీ గెలవడానికి వాడుకోవడానికే ఈ ఉచితాలు. ఉద్యోగుల జీతాలకంటే, ప్రజలకు విద్యా, వైద్య సౌకర్యాలకంటే, ఓట్లు రాల్చే ఈ ఉచితాలే ముఖ్యం. అప్పులు చేసైనా సరే 'భవిత బంగారం' కోసం ప్లాన్లే ముఖ్యం వీళ్లకు అన్నాడు అబ్బాయి. గ్రామ సింహానివైనా, మనిషి మోసం గ్రహించి, వెనక్కి వచ్చేశావు కానీ మనుషులకీ తెలివెక్కడిది? పాపం అనుకుంటాంకానీ 'అమాయకులే' అంది డాంకీ. నాలుగు బిస్కట్లిచ్చి, నాతో ఆడుకుందామనుకున్నాడు. నేను సాగనిస్తానా? బలవంతుల దుర్మార్గాలు, యుక్తులు, కుయుక్తులు ఇంకానా ఇక పైచెల్లవు అంటూ వచ్చేశా. మళ్లీ వాడిటువైపు రావాలి, మోకాలి పిక్కపీకి చేతిలోపెడ్తా అంది డాగీ.

ఉత్తేజంగా సీపీఐ శతవసంత వేడుక

అరవింద్ రాజ్ స్వరూప్

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతవసంతాల వేడుకలు 2024 డిసెంబరు 26న కాన్పూర్‌లో ఉత్సాహభరిత, ఉత్తేజకర వాతావరణంలో ఘనంగా జరిగాయి. పార్టీ స్థాపించిన కాన్పూర్‌లో గొప్పగా శత వసంత ఉత్సవాలు జరిగాయి. కాన్పూర్‌లోని ఖలసి లైన్‌లోని శాస్త్రిభవన్‌లో ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలు నిర్వహించారు. ఈ ఏడాది పొడవునా ఈ వేడుకలు నిర్వహిస్తారు. సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు అమర్‌జిత్ కౌర్, డాక్టర్ గిరీష్‌తోపాటు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఉత్తరప్రదేశ్ పార్టీ కార్యదర్శి అరవింద్‌రాజ్ స్వరూప్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం జరిగిన ప్రాంతానికి హస్రత్ మోహాని నగర్‌గా పేరుపెట్టారు. ఆడిటోరియానికి అజయ్‌ఘోష్ పేరుపెట్టారు. వంద పార్టీ పతాకాలతో అరుణార్ణవంగా అలంకరించిన ప్రాంతంలో పార్టీ పతాకాన్ని డి.రాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ నాయకులు పార్టీ పతాకాన్ని శ్లాఘిస్తూ విప్లవ గీతాలు ఆలపించారు. కార్మికులు ఎర్రజెండాలను చేబూని పెద్దఎత్తున నినాదాలు చేశారు. కాన్పూర్‌లో 1925 డిసెంబరు 25, 26 తేదీలలో పార్టీని స్థాపించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు హాజరయ్యారు. పార్టీ స్థాపన చేయాలని డిసెంబరు 26న నిర్ణయించారు. పార్టీ పేరును సీపీఐగా ఐక్యంగా నిర్ణయించారు. 25వ తేదీన ప్రారంభమైన వ్యవస్థాపక మహాసభ డిసెంబరు 29వరకు కొనసాగింది. ఆహ్వాన కమిటీకి చైర్మన్‌గా హస్రత్ మోహాని వ్యవహరించారు. సభకు ఎం.సింగారవేలు చెట్టియార్ అధ్యక్షత వహించారు.

2024 డిసెంబరు 25వ తేదీ నుంచి 2025లో సంవత్సరంపాటు పార్టీ ఉత్సవాలు జరుగుతాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇంతాయాజ్ అహమ్మద్, మోతీలాల్, రాజేష్ తివారి, రామచంద్ర సరాస్, ఫూల్‌చంద్ యాదవ్, కాంచన్‌మిత్ర తదితరులు పార్టీ వేడుకల ప్రారంభానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదికపైన అనేకమంది ప్రముఖులు ఆశీనులయ్యారు. రాష్ట్ర పార్టీ కార్యవర్గసభ్యులు అబ్దుల్‌గఫార్, శిరోమణిసింగ్ రాజ్‌పుత్, వినోద్‌రాయ్, కల్పత్‌గుప్తా, అమిత్ యాదవ్, ఆర్‌కె శర్మ, సుహేబ్ శర్వాణి హాజరయ్యారు. పార్టీలో ప్రముఖ నాయకులు, వివిధ సంఘాల నాయకులను ఈ సందర్భంగా సత్కరించారు. ఇప్టా జాతీయ ఎగ్జికూటివ్ చైర్మన్ రాకేష్, ఏఐటీయూసీ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వికె సింగ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ హాజరయ్యారు. కిసాన్ సభ అధ్యక్షుడు ఇంతియాజ్ బేగ్, ఉత్తరప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి మహేంద్రరాయ్, చైర్మన్ జవహర్‌లాల్ విశ్వకర్మ హాజరయ్యారు.

ప్రగతిశీల రచయితల అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ ఖాన్ అహ్మద్ పరూఖ్, డాక్టర్ అనంద్‌శుక్లా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పార్టీ కాన్పూర్ జిల్లా కార్యదర్శి రాంప్రసాద్ కనౌజియా ఉత్సవాల్లో పాల్గొని వేదికమీద పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు సానుభూతిపరులకు స్వాగతం పలికారు.

రాష్ట్ర పార్టీ కోశాధికారి పరమానంద పాల్గొన్నారు. కాన్పూర్ ఇప్టా బృందం డాక్టర్ ఉమేంద్రకుమార్ నాయకత్వంలో వేడుకలు ప్రారంభంలో విప్లవ గీతాలు ఆలపించారు. ఈ సందర్భంలో డి.రాజా మాట్లాడుతూ, గత శతాబ్దికాలంగా పార్టీ అణగారిన వర్గాల ప్రజలు హక్కులకోసం పెట్టుబడీదారీ విధానానికి వ్యతిరేకంగా, సోషలిజం, కమ్యూనిజం స్థాపనకోసం పోరాడుతూ వచ్చిందని అన్నారు. గత దశాబ్దికాలంగా బీజేపీ హానికరమైన అజెండాను అమలుచేస్తోందన్నారు. బీజేపీ పాలనలో పేదరికం, నిరుద్యోగం అత్యధికంగా పెరిగాయనీ, సమస్యలను వదిలేసి బీజేపీ మత ఉద్రిక్తతలను పెంచుతోందని విమర్శించారు. రాజ్యాంగ సవరణలు చేసేందుకు అణగారిన వర్గాల ప్రజలు అంటే దళితులు, వెనుకబడిన తరగతులవారికి వ్యతిరేకంగా హింసకు బీజేపీ పాల్పడుతోందన్నారు. రాజ్యాంగాన్ని తొలగించి మనుస్మృతిని ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడాన్ని రాజా ఖండిస్తూ ఆయన తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకంగా మతతత్వంతో పరిపాలిస్తు న్నాయని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ మొట్టమొదట సంపూర్ణ స్వరాజ్యంకోసం తీర్మానించిందని రాజా తెలిపారు. 1925లో స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్ స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనకుండా బ్రిటీష్ పాలకులను సమర్థించింది. బీజేపీ పాలనను అంతంచేసి వామపక్ష ప్రజాస్వామ్య శక్తుల పాలనకోసం పార్టీ కార్యకర్తలు నడుంకట్టి ప్రజలను చైతన్యవంతులను చేయాలని రాజా పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ మాట్లాడుతూ, పార్టీ అనేక సవాళ్లను ఎదర్కొంటున్నప్పటికీ ఎల్లవేళలా పోరాటాలు చేస్తున్నది. త్యాగాలకు వెనుకాడడంలేదు. పేదవర్గాలు, కార్మికవర్గం, నిరుద్యోగులకోసం ఎల్లవేళలా పార్టీ పోరాడుతోందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంలో కార్మికవర్గం జీవనభృతికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వంలో దేశంలోని ఒక్కశాతం మంది 40శాతం సంపదను కలిగిఉన్నారని, బ్యాంకులకు బడా కార్పొరేట్లు 16లక్షల కోట్ల రూపాయలను ఎగవేశారని అమర్‌జిత్ కౌర్ విమర్శించారు. జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు డాక్టర్ గిరీష్ మాట్లాడుతూ, దళితులకు సామాజిక న్యాయం, మహిళలకు సమానత్వం, ప్రజాస్వామ్య హక్కులకోసం పార్టీ క్షేత్ర స్థాయినుంచి పోరాటం చేయాలన్నారు. రైతులు, కార్మికులు, విద్యార్థుల సమస్యలపై పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఐ ప్రముఖ నాయకులు అరవింద్‌రాజ్ స్వరూప్ మాట్లాడుతూ, 1964లో పార్టీ చీలిపోయిందని, అయితే పార్టీ స్థాపన కాన్పూర్‌లో జరిగిందని గుర్తిస్తున్నామని అన్నారు. పెట్టుబడీదారీ దోపిడీని అణచివేయాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, సోషలిజంను స్థాపించాలని పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి జిల్లాల్లో వందగ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని కోరారు. సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్న రంజిత్‌సింగ్ సెనగార్, రాజేంద్ర దత్తశుక్లా, మాస్టర్ అఖ్‌లక్, ఇబ్రహీంలను ఆహ్వాన సంఘం సత్కరించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సీపీఐ కార్యదర్శి ముగింపు పలుకులు పలికారు.

> పార్టీ కార్యకర్తలు నడుంకట్టి ప్రజలను చైతన్యవంతులను చేయాలని రాజా పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ మాట్లాడుతూ, పార్టీ అనేక సవాళ్లను ఎదర్కొంటున్నప్పటికీ ఎల్లవేళలా పోరాటాలు చేస్తున్నది. త్యాగాలకు వెనుకాడడంలేదు. పేదవర్గాలు, కార్మికవర్గం, నిరుద్యోగులకోసం ఎల్లవేళలా పార్టీ పోరాడుతోందని చెప్పారు.

కమ్యూనిస్టుల నారుమడి బెనారస్

ఆర్వీ రామారావ్

అనిబిసెంట్ 1898లో నెలకొల్పిన సెంట్రల్ హిందూ కళాశాల 1916లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంగా మారింది. దీనికి ప్రధాన కారకుడు మదన్ మోహన్ మాలవియా. మాలవియా 1911కల్లా అనిబిసెంట్ నెలకొల్పిన కళాశాల మీద శ్రద్ధ చూపించడం మొదలు పెట్టారు. 1911కల్లా క్రమంగా ఆమెను పక్కకు నెట్టేశారు. అనిబిసెంట్ నెలకొల్పిన దివ్యజ్ఞాన రీతిలో కాకుండా తాను నెలకొల్పదలచుకున్న విశ్వవిద్యాలయం హిందూ మతం వేపు మొగ్గాలని మాలవియా భావించినట్టున్నారు. ధర్భంగా మహారాజా రామేశ్వర్ సింగ్, ఆదిత్య నారాయణ్ సింగ్, బెనారస్ మహారాజా ప్రభు నారాయణ్ సింగ్, న్యాయవాది సుందర్ లాల్ సాయంతో మాలవియా 1916 నాటికి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నెలకొల్పారు. అనిబిసెంట్‌కు కూడా కొంత పాత్ర లేకపోలేదు. కానీ అది గౌణమైనదే.

"విజ్ఞాన శాస్త్రాన్ని కోట్లాది మంది పేదల ప్రయోజనాలకు వినియోగించినప్పుడే పేదరికంలో కూరుకుపోయినవారు బయట పడగలరు. భారతీయులకు తమ దేశంలోనే విజ్ఞాన శాస్త్రం అందుబాటులో ఉంటేనే ఇది సాధ్యం" అన్న ఉదాత్త భావన మాలవియాకు ఉండేది. మాలవియా ఊహలకు తగ్గట్టే ఇప్పుడు అందులో 30,000 మందికి పైగా విద్యార్థులున్నారు. అందులో సగం కన్నా ఎక్కువ మంది 65 వసతి గృహాల్లో ఉంటారు. 45 దేశాలకు చెందిన వారు అక్కడ విద్య అభ్యసిస్తున్నారు. బెనారస్ విశ్వవిద్యాలయం వేలాది ఎకరాల్లో విస్తరించి ఉంది. మూడు ఆవరణలున్నాయి. విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవానికి మాలవియా మహాత్మా గాంధీ, జగదీశ్ చంద్ర బోస్, సి.వి.రామన్, ప్రఫుల్ల చంద్ర రాయ్ లాంటి వారిని ఆహ్వానించారు. అనిబిసెంట్ చేత వరసగా కొన్ని ప్రసంగాలు చేయించారు. స్వదేశం తిరిగి వచ్చిన తరవాత మహాత్మా గాంధీ బహిరంగంగా ఒక సభలో మాట్లాడింది బెనారస్ విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవంలోనే. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ విశ్వవిద్యాలయంలో పాఠాలు చెప్పారు. ప్రసిద్ధ కవి హరివంశ్ రాయ్ బచ్చన్, రాజకీయ నాయకుడు రాజ్ నారాయణ్, ప్రసిద్ధ శాస్త్రవేత్త కోట హరినారాయణ లాంటి వారు ఈ విశ్వవిద్యాలయంలో చదువుకున్న వారే. హెడ్గేవార్ తరవాత ఆర్.ఎస్.ఎస్. అధినేత అయిన గోల్వాల్కర్ ఇక్కడే చదువుకుని ఇక్కడే అధ్యాపకుడిగా పనిచేశారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నెలకొల్పడంలో మాలవియా లక్ష్యం ఏమైనప్పటికి అది మొదటి నుంచీ కుడి ఎడమల భిన్న భావాలుగల వారికి నెలవుగా ఉండేది. విశ్వ విద్యాలయానికి ఉండవలసిన లక్షణాలు దానికి సంపూర్ణంగా ఉండేవి. మాలవియా హిందూ మతానుయాయి అయినా ముస్లిం వ్యతిరేకి కారు. "ఒకసారి గంగానది స్నాన ఘట్టంలో శూద్రులకు వేదం వినిపించకూడదంటూ ఆర్.ఎస్.ఎస్.వారు చిందులు తొక్కుతుంటే మేం దాన్ని వ్యతిరేకించాం. మాలవియాకు ఇది తెలిసి అక్కడికొచ్చారు. శూద్రులకు వేద పఠనం కచ్చితంగా పనికి వస్తుందని శాస్త్రాధారాలతో రుజువు చేశారు" అని అక్కడ కొన్నేళ్లు చదువుకున్న చంద్ర రాజేశ్వర రావు చెప్పారు.

తెలుగు నేలలో శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని గాంధీ-ఇర్విన్ ఒప్పందం కారణంగా ఆ ఉద్యమం నీరుగారి పోవడంవల్ల యువతరం కొత్త దారులు అన్వేషించడం మొదలు పెట్టింది. అలాంటి వారు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ప్రవేశించారు. పోలేపెద్ది నరసింహ మూర్తి, పులుపుల వెంకట శివయ్య, కాట్రగడ్డ నారాయణ రావు, నందూరి ప్రసాదరావు బెనారస్ వెళ్లి చదువుకున్నారు. దారిద్ర్యాన్ని, నిరుద్యోగాన్ని నిర్మూలించే మార్గాలు సూచించేవారు అక్కడ ఉన్నారని భావించిన చంద్ర రాజేశ్వరరావు, చంద్ర రామలింగయ్య, పొన్నం వీర రాఘవయ్య కూడా బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో చదువుకున్న వారు. రాజేశ్వరరావు 1931లో అక్కడ యంగ్ కమ్యూనిస్టు లీగ్ స్థాపించారు. ఆ యూనివర్సిటీ గ్రంథాలయంలో వేదాలు మొదలుకొని కమ్యూనిజం వరకు చాలా గ్రంథాలు ఉండేవి. ప్రభుత్వం నిషేధించిన గ్రంథాలూ ఉండేవి. అది ఒక స్వతంత్ర రాజ్యంలా కనిపించేదని పొన్నం వీర రాఘవయ్య అన్నారు. ఆర్.ఎస్.ఎస్. వారితో పాటు వ్యక్తివాద విప్లవకారుల వరకు అందరూ ఉండేవారు. సోషలిస్టు స్టడీ సర్కిలూ ఉండేది. దానికి కార్యదర్శి పొన్నం వీర రాఘవయ్య. ఇది రహస్యంగా పని చేసేది. మీరట్ కుట్ర కేసులో శిక్ష అనుభవించి విడుదలైనవారిని విశ్వవిద్యాలయానికి ఆహ్వానించి ఉపన్యాసాలిప్పించేవారు. జోగ్లేకర్, పి.సి.జోషి, డాంగే అలా ఉపన్యాసాలిచ్చారు. మీరట్ కుట్ర కేసులో జైలుకెళ్లిన హచిన్సన్‌ను అక్కడ సన్మానించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్‌గా ఉన్న మదన్‌మోహన్ మాలవియా దానికి అనుమతించడం ఆయనలో మతాభిమానం ఉన్నా మత విద్వేషం లేదనడానికి నిదర్శనం. సోషలిస్టు స్టడీసర్కిల్‌తో పాటు యంగ్ కమ్యూనిస్ట్ లీగ్ కూడా ఉండేది. యంగ్ కమ్యూనిస్ట్ లీగ్ విద్యార్థులు, అధ్యాపకులలో కుల, మత దురభిమానాలు లేకుండా చేయడానికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసేవారు.

స్వాతంత్ర్య పోరాటం జయప్రదంగా నడిపేందుకు మార్గం గోచరించగానే పోలేపెద్ది నరసింహమూర్తి 1934లో బి.ఎ.పరీక్ష రాయకుండానే తెనాలి చేరుకున్నారు. పులుపుల శివయ్య పరీక్ష రాసి వచ్చేటప్పుడు ట్రంకు పెట్టెనిండా కమ్యూనిస్టు సాహిత్యం తీసుకొచ్చారు. అయితే ఆయన 1935 మార్చిలో బి.ఎస్సీ సప్లిమెంటరీ పరీక్ష పూర్తి చేసి వచ్చారు. వీర రాఘవయ్య న్యాయ శాస్త్రం చదువుతూ 1937 వరకు బెనారస్‌లోనే ఉండిపోయారు. చంద్ర రాజేశ్వరరావు 1935లో బెనారస్ వదిలి విశాఖపట్నం మెడికల్ కాలేజీలో చేరారు. తుమ్మల వెంకట్రామయ్య కాశీ విద్యాపీఠ్‌లో "శాస్త్రి" కోర్సు చదవడానికి వెళ్లారు. అయితే ఆయన ఆ కోర్స్ పూర్తి చేయనే లేదు. బెనారస్ నుంచి తిరిగి వచ్చిన తుమ్మల వెంకట్రామయ్య తెనాలి తాలూకా కొల్లూరులో ఉంటూ సాహిత్య రంగంలో కృషి చేశారు. "ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా" అని మొట్ట మొదటి ఎర్ర జెండా పాట రాసింది తుమ్మలే. 1935 ప్రభ పక్ష పత్రిక ఏప్రిల్, మే, జూన్ సంచికలో ఎర్ర జెండా గేయం అచ్చయింది. సాహిత్యం ద్వారానే తనలో కమ్యూనిస్టు భావాల అంకురార్పణ జరిగింది అనే వారు తుమ్మల. 1934 జులైలో అమ్మ నవలను సంక్షిప్తం చేసి "మాతృహృదయం" గా అనువదించారు తుమ్మల. కాశీ విద్యా పీఠ్ లో 1934లో కమ్యూనిస్టు సెల్ ఏర్పడింది. ఆంధ్ర కమ్యూనిస్టులు చాలా మందికి బెనారస్‌తో దగ్గరి సంబంధం ఉంది. అనేకమంది అక్కడ కమ్యూనిజంలో తొలి పాఠాలు నేర్చుకున్నారు. అందుకే బెనారస్ కమ్యూనిస్టులకు నారు మడి.

లోయలో పడిన బస్సు... నలుగురి మృతి

తిరువనంతపురం: బస్సు లోయలో పడిన దుర్ఘటనలో నలుగురు ప్రయాణికులు మరణించారు. మరో 32 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కేరళలోని కొటరక్కర-దిండిగల్ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బ్రేక్ ఫెయిల్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీస్ ఉన్నతాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులోని తంజావూర్ పర్యటనకు వెళ్లిన యాత్రికులు తిరిగి స్వస్థలం అలప్పూజ జిల్లాలోని మావెలిక్కరకు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. ఇడుక్కి జిల్లాలోని కల్లివాయల్ ఎస్టేట్ సమీపంలో ఉదయం ఈ దుర్ఘటన చోటు చేసుకుందని వివరించారు. మృతులను అరుణా హరి (55), రామ్మోహన్ (40), సంగీత (45), బిందు ఉన్నితాన్ (59)గా గుర్తించామన్నారు. పర్వత ప్రాంతంలో మలుపు తిరిగే క్రమంలో బస్సు బ్రేకులు ఫెయిల్ అయి... అదుపు తప్పి 70 అడుగుల లోతు ఉన్న భారీ లోయలోకి పడి పోయిందన్నారు. స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ సంస్థకు చెందిన సిబ్బంది సహాయంతో సహాయక చర్యలు చేపట్టామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

ప్రశాంత్ కిశోర్ దీక్ష భగ్నం... అరెస్టు

పాట్నా: బీపీఎస్సీ వ్యవహారంలో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో నాలుగు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న ప్రశాంత్ కిశోర్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి... ఆస్పత్రికి తరలించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. చట్టవిరుద్ధంగా నిరసన చేపట్టినందువల్ల ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిరసన ప్రదేశంలో గుమిగూడిన అభ్యర్థులను అక్కడి నుంచి ఖాళీ చేయించామన్నారు. ఇటీవల బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రశాంత్ కిశోర్ జనవరి 2న గాంధీ మైదానంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. రెండు వారాలుగా బీపీఎస్సీ అభ్యర్థులు తీవ్ర ఆందోళనలు చేపడుతున్నా... ప్రభుత్వంలో ఎలాంటి కదలిక రావట్లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రిలిమినరీ పరీక్ష రద్దు చేసి... మళ్లీ కొత్తగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఇస్రో 'స్పేడెక్స్' 9కి వాయిదా

బెంగళూరు: అంతరిక్షంలో స్పేస్ డాకింగ్ ప్రయోగం (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూకక్ష్యలో అనుసంధానం చేసే ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే పీఎస్ఎల్వీ-సీ60 ద్వారా 440 కిలోల బరువున్న రెండు ఉపగ్రహాలను విజయవంతంగా నింగిలోకి పంపింది. తాజాగా, ఈ పరీక్షకు సంబంధించి ఇస్రో కీలక ప్రకటన చేసింది. స్పాడెక్స్ డాకింగ్ ఆపరేషన్‌ను 2025, జనవరి 9కి వాయిదా వేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. సోమవారం గుర్తించిన అబార్ట్ దృష్టాంతం ఆధారంగా గ్రౌండ్ సిమ్యులేషన్స్ ద్వారా డాకింగ్ ప్రక్రియకు మరింత ధ్రువీకరణ అవసరమని ఇస్రో పేర్కొంది. అంతకుముందు ఈ డాకింగ్ ఆపరేషన్‌ను జనవరి 7న ప్లాన్ చేసినట్లు ఇస్రో తెలిపింది. తాజాగా ఆ గడువును రెండు రోజులు పొడిగించింది. స్పాడెక్స్ ఆన్‌బోర్డ్ వీడియోను ఇస్రో ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది.

విశాల్ ఆరోగ్యంపై వదంతులు

చెన్నై: హీరో విశాల్ ఆరోగ్యంపై వదంతులు వ్యాపించాయి. దీంతో ఆయన ఆరోగ్య బులెటిన్‌ను విశాల్ బృందం సోమవారం విడుదల చేసింది. విశాల్ వైరల్ ఫీవర్‌తో ఇబ్బందిపడుతున్నారని, వైద్యులు బెడ్ రెస్ట్ తీసుకోమని సూచించినట్లు వెల్లడించింది. విశాల్ హీరోగా సుందర్.సి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మదగజరాజ'. అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ కథానాయికలుగా నటించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఈ సినిమా విడుదలవుతోంది. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం చెన్నైలో ఈవెంట్ నిర్వహించారు. ఇందులో విశాల్, ఖుష్బూ, సుందర్.సితోపాటు చిత్ర సంగీత దర్శకుడు విజయ్ ఆంటోనీ పాల్గొన్నారు. సినిమా విశేషాలు పంచుకున్నారు. సినిమా గురించి విశాల్ మాట్లాడుతున్న సమయంలో ఆయన చేతులు వణుకుతూ కనిపించాయి. ఆయన ఒకింత నీరసంగా ఉన్నారు. అక్కడే ఉన్న యాంకర్ మాట్లాడుతూ విశాల్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారని చెప్పింది. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

మారని గవర్నరు తీరు

- తమిళనాడు అసెంబ్లీ నుంచి వాకౌట్
- గవర్నర్‌ది 'పిల్లచేష్ట' అంటూ స్టాలిన్ మండిపాటు

చెన్నై: తమిళనాట డీఎంకే ప్రభుత్వంతో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి విభేదాలు మరింత ముదిరాయి. చాలాకాలంగా పాలనాపరమైన విషయాలతో పాటు ఇతరత్రా అంశాలపై డీఎంకే ప్రభుత్వంతో గవర్నర్‌కు రగడ కొనసాగుతోంది. తాజాగా మరోసారి అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వంతో గవర్నర్ విభేదించారు. అసెంబ్లీ సమావేశాల తొలి రోజు సంప్రదాయంగా సభను ఉద్దేశించి ప్రసంగించేందుకు ఆయన నిరాకరించి వెళ్లిపోయారు. రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సంప్రదాయం ప్రకారం సభ సమావేశమైనప్పుడు రాష్ట్ర గీతం తమిళ్ థాయ్ వాజత్తు (తమిళ తల్లికి వందనం), సభ ముగిసిన తర్వాత చివరలో జాతీయ గీతం ఆలపిస్తారు. అయితే ఈ నిబంధన మార్చాలని గవర్నర్ రవి డిమాండ్ చేశారు. సభ ప్రారంభంలోనూ జాతీయ గీతం ఆలపించాలని సభా నాయకుడు అయిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, స్పీకర్ ఎం.అప్పావును కోరారు. వారు నిరాకరించడంతో గవర్నర్ రవి సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో గవర్నర్ చదవాల్సిన సంప్రదాయ ప్రసంగాన్ని స్పీకర్ ఎం.అప్పావు చదివి వినిపించారు. 'ఈరోజు తమిళనాడు అసెంబ్లీలో భారత రాజ్యాంగానికి, జాతీయ గీతానికి మరోసారి అవమానం జరిగింది. జాతీయ గీతాన్ని గౌరవించడం మన రాజ్యాంగంలో పొందుపరిచిన మొదటి ప్రాథమిక విధి. ఇది అన్ని రాష్ట్రాల శాసనసభలలో గవర్నర్ ప్రసంగం ప్రారంభంలో, చివరిలో ఆలపించడం జరుగుతుంది' అని గవర్నర్ సభను బహిష్కరించిన తర్వాత రాజ్ భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. 'ఈరోజు గవర్నర్ సభకు రాగానే తమిళ థాయ్ వాజత్తు మాత్రమే ఆలపించారు. గవర్నర్ సభకు రాజ్యాంగ కర్తవ్యాన్ని గౌరవపూర్వకంగా గుర్తు చేశారు. జాతీయ గీతాన్ని ఆలపించాలని ముఖ్యమంత్రి, స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అయితే వారు సున్నితంగా తిరస్కరించారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే అంశం. రాజ్యాంగాన్ని, జాతీయ గీతాన్ని అవమానించడంతో తీవ్ర వేదనతో గవర్నర్ సభ నుంచి వెళ్లిపోయారు' అని రాజ్‌భవన్ పేర్కొంది. దీనిపై ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తూ అసెంబ్లీ సంప్రదాయాన్ని ఉల్లంఘించడం గవర్నర్ ఆనవాయితీగా మార్చుకున్నారని, అతని చర్యలను 'పిల్లచేష్టలు'గా అభివర్ణించారు. 'రాజ్యాంగం ప్రకారం గవర్నర్ సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ ప్రసంగాన్ని చదవడం శాసన ప్రజాస్వామ్య సంప్రదాయం! దానిని ఉల్లంఘించడం గవర్నర్ ఆనవాయితీగా మార్చుకున్నాడు. ఉన్నదానిని కత్తిరించి లేనిది చేర్చిన గవర్నర్ ఈసారి చదవకుండా పోవడం 'పిల్లతనం' అని అసెంబ్లీలో తన మునుపటి ప్రసంగాలలో గవర్నర్ దాటవేసిన భాగాలను స్టాలిన్ ప్రస్తావించారు. 'తమిళనాడు ప్రజలను, వారిచే ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని, సుదీర్ఘచరిత్ర గల తమిళనాడు శాసనసభను నిరంతరం అవమానించేలా గవర్నర్ చర్యలు ఆయన నిర్వహిస్తున్న పదవికి తగనివి. తమ రాజకీయ, న్యాయపరమైన విధులను నిర్వర్తించడానికి ఇష్టపడని వ్యక్తి పదవిలో ఎందుకు కొనసాగాలి? అనేది అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న!' అని పేర్కొన్నారు.

గవర్నర్‌ది ఎప్పుడూ ఇదే తంతు!

తమిళనాడు అసెంబ్లీలో గవర్నర్, డీఎంకే ప్రభుత్వం మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడం ఇదే తొలిసారి కాదు. గత ఫిబ్రవరిలో గవర్నర్ అసెంబ్లీలో సంప్రదాయ ప్రసంగాన్ని అందించడానికి నిరాకరించారు. ప్రసంగం ప్రతి పెద్దగా ఉందని ఆరోపించారు. అలాగే బీఆర్ అంబేద్కర్, పెరియార్, సీఎన్ అన్నాదురై పేర్లతో పాటు 'ద్రవిడ నమూనా' అనే పదం, శాంతిభద్రతలకు సంబంధించిన ప్రసంగంలోని భాగాలను చదవడానికి ఆయన నిరాకరించి సభ నుంచి వెళ్లిపోయారు. 2021లో తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆర్ఎన్ రవికి... స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంతో చాలా తక్కువ సంబంధాలు ఉన్నాయి. గవర్నర్ బీజేపీ అధికార ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని, బిల్లులు, నియామకాలను అడ్డుకుంటున్నారని డీఎంకే ప్రభుత్వం ఆరోపించింది. అయితే చట్టానికి తన సమ్మతిని నిలుపుదల చేయడానికి రాజ్యాంగం తనకు అధికారం ఇచ్చిందని గవర్నర్ అంటున్నారు. రాజ్‌భవన్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం సుప్రీం కోర్టు, రాష్ట్రపతి భవన్‌కు సైతం చేరింది. మంత్రివర్గం సూచనలు, సలహా మేరకు గవర్నర్లు పనిచేయాలని సుప్రీం కోర్టు, మద్రాసు హైకోర్టు స్పష్టంచేశాయి.

గుండెను చీల్చి బయటకు తీసి...

జర్నలిస్ట్ ముకేశ్ పోస్టుమార్టంలో వాస్తవాలు

రాయ్‌పూర్: దాదాపు రూ.120 కోట్ల విలువైన కాంట్రాక్టులో అవినీతిని బయటపెట్టినందుకు హత్యకు గురైన జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ కేసులో ఒళ్లు గగుర్పొడిచే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. హంతకులు అతడిని దారుణంగా కొట్టి... గుండెను చీల్చి బయటకు తీసినట్లు శవ పరీక్షల్లో తేలింది. ఇప్పటికే నిందితుడిని ఆదివారం హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ముకేశ్ మృతదేహానికి డాక్టర్లు శవ పరీక్ష ముగించారు. అతడి కాలేయం నాలుగు ముక్కలైనట్లు గుర్తించారు. అతడి పక్కటెముకలు ఐదు చోట్ల, తలపై 15 చోట్ల ఎముకలు విరిగిపోయాయి. అతడి గుండెను చీల్చినట్లు తేలింది. తమ 12 ఏళ్ల కెరీర్‌లో ఇంత భయానక హత్యను ఎన్నడూ చూడలేదని డాక్టర్లు వెల్లడించారు. ఇద్దరు కంటే ఎక్కువమందే ఈ హత్యలో పాల్గొన్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. బస్తర్‌కు చెందిన ముకేశ్... అదే ప్రాంతంలోని గంగలూరు నుంచి హిరోలి వరకు రూ.120 కోట్లతో చేపట్టిన రోడ్డు ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కథనం వెలువరించాడు. తొలుత రూ.50 కోట్ల టెండర్‌తో చేపట్టిన ఈ ప్రాజెక్టు... పూర్తిస్థాయి అభివృద్ధి జరగకపోయినప్పటికీ రూ.120 కోట్లకు చేరుకుందని వెల్లడించాడు. అనంతరం అతడు కనిపించకుండా పోయాడు. ఆ తర్వాత ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ సురేశ్ చంద్రకర్ ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్‌లో శవమై కనిపించాడు. పచ్చబొట్టు ఆధారంగా అతడిని గుర్తించారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేశారు. కాగా, ముకేశ్ కేసులో కీలక నిందితుడైన కాంట్రాక్టర్ సురేశ్ చంద్రకర్‌ను హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. అతడు ముకేశ్‌కు దూరపు బంధువు. హత్య జరిగిన రోజు నుంచి సురేశ్ కూడా అదృశ్యం కావడంతో పోలీసులు అతడిపై నిఘా వేశారు. చివరికి హైదరాబాద్‌లో తన డ్రైవర్ ఇంట్లో అతడు నక్కినట్లు గుర్తించారు. ఇందుకోసం దర్యాప్తు బృందాలు 200 సీసీ కెమెరాలను, 300 మొబైల్ నెంబర్లపై నిఘా వేశారు. ఇప్పటికే సురేశ్‌కు చెందిన బ్యాంక్ ఖాతాలను సీజ్ చేసి.. అక్రమంగా నిర్మిస్తున్న యార్డును ధ్వంసం చేశారు. అతడి భార్యను కూడా కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

11 రోజుల్లో పదిమంది రైతులు బలవన్మరణం

భువనేశ్వర్: ఒడిశాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తాము పండించిన పంట పూర్తిగా నష్టపోవడంతో... ఆ బాధ తట్టుకోలేక 11 రోజుల్లో పది మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. బీజేపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని, దీంతో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ప్రతిపక్షపార్టీ బీజేడీ (బిజు జనతాదళ్) విమర్శించింది. తాజాగా సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరాగిపాలి గ్రామానికి చెందిన 58 ఏళ్ల రత్నాకర్ భోరు ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట నష్టపోయిందన్న ఆవేదనతో ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం అతన్ని సంబల్‌పూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 5 గంటల సమయంలో మృతి చెందాడు. అకాల వర్షాలకు పంట నష్టపోవడం, అప్పుల బాధ తట్టుకోలేక తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆ రైతు కుమారుడు పరేశ్ కుమార్ తెలిపారు. కాగా, రైతుల మరణాలపై సీఎం మోహన్ చరణ్ మాఝీ స్పందించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా రైతులకు నేరుగా పరిహారం అందేలా చూస్తామని సీఎం ప్రకటించారు. బీమా చేసిన రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద 15 రోజుల్లో పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. అయితే బీజేపీ ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయని బీజేడీ మాజీ ఎమ్మెల్యే రోహిత్ పూజారి విమర్శించారు. ఒకవైపు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే బీజేపీ నేతలు పండుగలు, సమావేశాల్లో బిజీగా ఉన్నారని, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొరుగు దేశాలపై పాక్ అక్కసు: భారత్

న్యూఢిల్లీ: ఆఫ్గానిస్తాన్‌పై పాకిస్తాన్ వైమానిక దాడులను భారత్ సోమవారం తీవ్రంగా ఖండించింది. అంతర్గత వైఫల్యాలకు పొరుగువారిని నిందించడం ఇస్లామాబాద్ పాత పద్ధతి అని పేర్కొంది. కొన్ని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్... ఆఫ్గానిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో వైమానిక దాడులు చేసింది. 'మహిళలు, పిల్లలతో సహా ఆఫ్గాన్ పౌరులపై జరిగిన వైమానిక దాడులపై మీడియాలో వచ్చిన వార్తలను మేము గమనించాం. ఇందులో అనేక మంది తమ ప్రాణాలు కోల్పోయారు. అమాయక పౌరులపై దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. 'తన అంతర్గత వైఫల్యాలకు పొరుగు దేశాలను నిందించడం పాకిస్తాన్‌కు చెందిన పాత పద్ధతి. ఈ విషయంలో ఆఫ్గాన్ ప్రతినిధి ప్రతిస్పందనను కూడా మేము గుర్తించాం' అని చెప్పారు.

ఇంటిపేరుపై రాజకీయమా?

బీజేపీ నేత వ్యాఖ్యలపై ఆతిశీ భావోద్వేగం

న్యూఢిల్లీ: తన ఇంటి పేరు లక్ష్యంగా బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూడీ చేసిన వ్యాఖ్యలకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ ఆగ్రహం వ్యక్తంచేశారు. బిదూడీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఓట్ల కోసం ఇంతకు దిగజారుతారా అని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. 'సీఎం ఆతిశీ ఆమె తండ్రినే మార్చేశారు. గతంలో ఆమెకు ఒక ఇంటి పేరు ఉండగా... ప్రస్తుతం మరో పేరు వినియోగిస్తున్నారు. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డ అఫ్జల్ గురుకు క్షమాభిక్ష ప్రసాదించాలంటూ ఆమె తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు' అని రమేశ్ బిదూడీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై సోమవారం విలేకరుల సమావేశంలో స్పందించిన ఆతిశీ మండిపడ్డారు. 'నా తండ్రి ఒక ఉపాధ్యాయుడు. ప్రస్తుతం ఆయన ఒకరి సహాయం లేనిదే నడవలేని పరిస్థితిలో ఉన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం ఇంతకు దిగజారుతారా?ఒక వృద్ధుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదు. దేశంలో రాజకీయాలు దిగజారిపోతున్నాయంటే నమ్మలేకపోతున్నాను' అని భావోద్వేగానికి గురయ్యారు. రమేశ్ బిదూడీ వ్యాఖ్యలపై మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. మహిళా సీఎం పట్ల ఇలాంటి ప్రవర్తనను ఢిల్లీ ప్రజలు సహించరని అన్నారు. ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. కాగా, ఆప్ తరఫున కల్కాజీ నియోజకవర్గం నుంచి ఆతిశీ బరిలోకి దిగుతుండగా... అదే స్థానంలో బీజేపీ నుంచి రమేశ్ బిదూడీ పోటీ చేస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీని ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆయన... ఆతిశీ ఇంటి పేరుపై అనుచితంగా మాట్లాడారు. ఆయన తీరుపై కాంగ్రెస్, ఆప్ మండిపడుతున్నాయి.

రద్దీ ప్రదేశాల్లో మాస్కు ధరించండి

కర్నాటక ప్రభుత్వం ఆదేశం

బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరులో ఇద్దరు చిన్నారులకు హెచ్ఎంపీవీ వైరస్ సోకడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ వైరస్ కోవిడ్‌లా వ్యాప్తి చెందేది కాదని, అందువల్ల ఎవరూ భయపడొద్దని విజ్ఞప్తి చేసింది. రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని ప్రభుత్వం సోమ వారం కోరింది. శ్వాసకోశ సంబంధిత వైరస్ ప్రాథమికంగా పిల్లలపై ప్రభావం చూపిస్తుందని, వారిలో సాధారణంగా జలుబు వంటి ఇన్ఫెక్షన్లకు కారణమవు తుందని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇన్‌ఫ్లూయెంజాలాంటి అనారోగ్యం, తీవ్రమైన అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ల వంటి కేసులను నమోదు చేయాలని రాష్ట్రంలోని ఆస్పత్రులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు సూచనలు చేసింది. ఎవరైనా దగ్గు, తుమ్మిన సమయంలో నోరు, ముక్కు కప్పి ఉంచుకోవాలని, తరచూ సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని డీఎంఈ సూచించింది. ఈ వైరస్ లక్షణాలు ఉన్నవారు, రోగులకు సన్నిహితంగా ఉన్నవారు బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. వాడిన టిష్యూ పేపర్లు తిరిగి ఉపయోగించొద్దని, రుమాలు, తువ్వాలును షేర్ చేసుకోవద్దని కోరింది. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

మహిళలకు రూ.2,500 సాయం

కాంగ్రెస్ హామీ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ మహిళల కోసం 'ప్యారీ దీదీ యోజన'ను ప్రకటించింది. ఈ పథకం కింద మహిళలకు నెలనెలా రూ.2,500 ఆర్థిక సాయం అందనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేస్తామని వాగ్దానం చేసింది. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ పథకాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కర్నాటక మోడల్ తరహాలోనే 'ప్యారీ దీదీ' పథకాన్ని ఇక్కడ కూడా అమలు చేస్తామని, తొలి మంత్రివర్గ సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు ఖరారు చేస్తామని డీకే చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉండటంతో పార్టీలన్నీ ప్రధానంగా మహిళా పథకాలపై దృష్టి సారిస్తున్నాయి.

కాంగ్రెస్‌పై పెరుగుతున్న నమ్మకం

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుండటంతో ప్రజల్లోనూ నమ్మకం పెరిగినట్టు ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తెలిపారు. కర్నాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో ఏవైతే వాగ్దానాలు చేశామో... వాటన్నింటినీ అమలు చేశామని, ప్రజావిశ్వాసాన్ని పొందగలిగామని చెప్పారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కలల్లో విహరిస్తుంటారని, 11 ఏళ్లుగా ఢిల్లీ పరిస్థితి దిగజారిందని, ఎడ్యుకేషన్ మోడల్, ఉచిత విద్యుత్, ఉచిత నీళ్లు, అవినీతిని అంతం చేయడం వంటి హామీలన్నీ పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరిలో జరగనున్నాయి. ఢిల్లీలో 15 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది.

ఢిల్లీలో కోటిన్నర మంది ఓటర్లు

తుది జాబితా విడుదల చేసిన ఈసీ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఓటర్ల తుది జాబితాను ఢిల్లీ ఎన్నికల కమిషన్ సోమవారం విడుదల చేసింది. జాబితా ప్రకారం దేశ రాజధానిలో 1,55,24,858 మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. వీరిలో 84,49,645 మంది పురుష ఓటర్లు, 71,73,952 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబిజాలో లేనివారు 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లేదని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఎంతమంది కొత్త ఓటర్లను చేర్చారు, ఎంతమంది పేర్లను తొలగించారనే వివరాలు తాజా ఓటర్ల తాబితాలో ఈసీ పొందుపరిచింది. కాగా, మాజీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల పోటీ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ఓటర్లను తొలిగించారని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ చేసిన ఆరోపణలను ఎన్నికల అధికారి గత శనివారం తోసిపుచ్చారు. ఓట్ల తొలగింపు కోరిన అప్లికెంట్ల వివరాలను డీఈఓ ఇవ్వలేదని, ఉద్దేశపూర్వకంగానే ఓటర్ల పేర్లను డీఈఓ తొలగించారని ఎంపీ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని చెప్పారు. ఎన్నికల జాబితా నుంచి పేర్లు తొలగించడం పూర్తిగా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే ఉంటుందని తెలిపారు.

నటి హనీరోజ్ ఫిర్యాదుతో 27 మందిపై కేసు

చెన్నై: సోషల్‌మీడియా వేదికగా తనను వేధింపులకు గురిచేశారని నటి హనీ రోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఉదయం కేరళలోని ఎర్నాకుళం నగర పోలీసులు దాదాపు 27 మందిపై కేసు నమోదు చేశారు. అందులో కుంబళంకు చెందిన ఒకరిని అరెస్ట్ చేశారని స్థానిక పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. వివరణాత్మక విమర్శలను తాను స్వీకరిస్తానని హనీరోజ్ తెలిపారు ఈ మేరకు తాజాగా ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. 'వివరణాత్మక విమర్శలు, నా లుక్‌పై వేసే సరదా జోక్స్, మీమ్స్‌ను నేనూ స్వాగతిస్తా. వాటిని పెద్దగా పట్టించు కోను. కానీ, దానికంటూ ఒక హద్దు ఉంటుందని నమ్ముతున్నా. అసభ్యకరంగా చేసే వ్యాఖ్యలను ఏమాత్రం సహించను. అలాంటి వ్యాఖ్యలు చేసే వారిపై న్యాయ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నా. వారిపై నా యుద్ధం ప్రకటిస్తున్నా. నాకోసం మాత్రమే కాదు... మహిళలందరి కోసం నేను ఈ పోరాటం చేస్తున్నా' అని పేర్కొన్నారు. ఒక వ్యాపారవేత్త వల్ల తాను ఇబ్బంది పడుతున్నానంటూ ఆదివారం సాయంత్రం హనీరోజ్ ప్రకటన విడుదల చేశారు. ఆ వ్యక్తి గతంలో కొన్ని కార్యక్రమాలకు తనను ఆహ్వానించాడని, వేర్వేరు కారణాల వల్ల వెళ్లేందుకు నిరాకరించానని ఆమె తెలిపారు. అందుకు ప్రతీకారంగా తాను హాజరయ్యే ప్రతి ఈవెంట్‌కు రావడం... వీలు కుదిరినప్పుడల్లా కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రారంభించాడని ఆమె తెలిపారు. దీనిపై తాను పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు. 'వీరసింహా రెడ్డి'తో హనీరోజ్ తెలుగు ప్రేక్షకులకు చేరువైన విషయం తెలిసిందే.

మాజీ సీజేఐ చంద్రచూడ్‌పై అవినీతి కేసు కొట్టివేత: లోక్‌పాల్



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌పై అవినీతి ఆరోపణకు సంబంధించిన ఫిర్యాదును కొట్టివేసినట్లు అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ వెల్లడించింది. అక్టోబర్ 18, 2024న ఈ ఫిర్యాదు దాఖలైంది. నిర్దిష్ట రాజకీయనాయకుడిని రక్షించడానికి, ఓ రాజకీయ పార్టీకి అనుకూలంగా అవినీతికి పాల్పడి అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఇందులోని విభిన్న ఆరోపణలపై విచారించిన లోక్‌పాల్... లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 14 ప్రకారం సిట్టింగ్ సీజేఐ లేదా సుప్రీం కోర్టు న్యాయమూర్తి తన అధికార పరిధికి అనుకూలంగా ఉన్నారా అనేది పరిశీలించిన పిమ్మట కాలదోషం పట్టిన పిటిషన్‌గా పేర్కొంటూ ఈ నెల మూడవ తేదీన లోక్‌పాల్ ఉత్తర్వులిచ్చింది. 'మేము ఈ ఫిర్యాదును అధికార పరిధి ద్వారా నిరోధించినట్లుగా పరిష్కరిస్తాము" అని లోక్‌పాల్ చైర్‌పర్సన్ జస్టిస్ ఎఎమ్ ఖాన్విల్కర్, మరో ఐదుగురు ఇతర సభ్యులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే చట్టంలో అనుమతించబడిన ఇతర మార్గాలను అనుసరించడానికి ఫిర్యాదుదారు స్వేచ్ఛ ఉందని ఉత్తర్వు పేర్కొంది.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన వినతులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కారించాలని జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజలనుండి జిహెచ్ఎంసి ఉన్నతాధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 4 విన్నపాలు రాగా, సత్వర పరిష్కారం కోసం ఆయా విభాగాలకు పంపించడం జరిగింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 44 అర్జీలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 10, ఇంజనీరింగ్ (మెయింటెనెన్స్) విభాగానికి 7, ఎఫ్ ఏ సెక్షన్‌కు 5, శానిటేషన్ విభాగానికి 3, ట్యాక్స్, హెల్త్, అడ్మినిస్ట్రేషన్, హౌసింగ్, ఎలక్ట్రికల్, యుబిడి విభాగాలకు 2 ఫిర్యాదుల చొప్పున, ఎంటమాలజీ, లేక్స్, అడ్వర్టైజ్మెంట్స్, ఐటీ, స్పోర్ట్స్, విజిలెన్స్, ఎస్టేట్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 105 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 50, సికింద్రాబాద్ జోన్‌లో 12, శేరిలింగంపల్లి జోన్‌లో 18, చార్మినార్ జోన్‌లో 7, ఎల్బీనగర్ జోన్‌లో 13, ఖైరతాబాద్ జోన్‌లో 5 ఆర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక, రఘు ప్రసాద్, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ సి.సి.పి గంగాధర్, యుబిడి డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎల్ఈవో రాములు నాయక్, (ఎస్ఎన్‌డిపి) డిప్యూటీ సి.ఇ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని వాణీనగర్ తదితర ప్రాంతాలలో ఆమె పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వాణీనగర్‌లో డ్రైనేజీ, రోడ్లు, మంచి నీటి సమస్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పదంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధి పదంలో ముందుందని రాబోయే మూడు నెలల్లో మున్సిపాలిటీ రూపు రేఖలు మారనున్నాయని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ చైర్మెన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి అన్నారు. సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ మల్ రెడ్డి అనురాధ అధ్యక్షతన తొర్రూర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రోడ్డు డెవలప్మెంట్ చైర్మన్ రాంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో వారు మాట్లాడుతూ అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. 80 లక్షల రూపాయలతో పార్కుల చుట్టూ ఫెన్సింగ్ పనులు, 3.75 కోట్ల రూపాయలతో అన్ని వార్డులలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, మంచినీటి మొదలగు అభివృద్ధి పనులను చేపట్టేందుకు నిధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, కమీషనర్ కె.అమరేందర్ రెడ్డి. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి : కూన

విశాలాంధ్ర - దుండిగల్ : మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి నిజాంపేట్ హెచ్ఎండబ్ల్యు ఎస్ఎస్‌బి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని, పలు డివిజన్‌లకు చెందిన ఆదర్శనగర్, దేవభూమి నగర్, మెట్కాన్ గూడ, శారదా కాలనీ, కెకెఎమ్ నగర్, రాజీవ్ గాంధీనగర్, కళావతి నగర్, శ్రీవేను ఎంక్లవ్, చింతల్ సూరారం కాలనీ, జగద్గిరిగుట్టలో నీళ్లలో ప్రెజర్, సరిపడే త్రాగు నీటి సమస్యలపై జనరల్ మేనేజర్ అశోక్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ప్రజా పాలన ఉన్నది ప్రజల సంక్షేమం కోసమేనని, ప్రజావాణిలో వచ్చిన సమస్య పరిష్కరించే ప్రయత్నం చేసి ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన విధానం అధికారులు మర్చిపోయారన్నారు. ఈ ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయాలనీ చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విధంగా మళ్ళీ ప్రవర్తిస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అధికారులపై తగిన చర్యలు చేబడతామని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హెచ్ఎమ్ డబ్ల్యూ ఎస్ఎస్‌బి అధికారులపై మండిపడ్డారు.

మెట్రో స్టేషన్లలో వ్యాపారం చేసుకునేందుకు భూములు కోల్పోయిన వారికి మొదటి ప్రాధాన్యత

మీరాలం నుండి స్కై వాక్ ఏర్పాటు చేయండి

భూనిర్వాసిత లబ్దిదారులకు మొదటి విడద 40 మందికి రూ.18.63 కోట్ల చెక్కుల పంపిణీ

పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ ఓల్డ్ సిటీలో చేపట్టే మెట్రో రైల్వే లైన్ నిర్మాణం కోసం పాత బస్తీ వాసులు ఇండ్లు, భూములు కోల్పోయిన వారు వ్యాపారం చేసుకునేందుకు మెట్రో స్టేషన్లలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో మెట్రో రైల్ నిర్మాణం కోసం ఇండ్లు, స్థలాలు కోల్పోయిన వారికి 40 మంది భూ నిర్వాసిత లబ్దిదారులకు రూ.18.63 కోట్ల చెక్కులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మెట్రో ఎం.డి ఎన్.వి.ఎస్ రెడ్డిలతో కలిసి హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్రో ప్రాజెక్ట్ ఫేజ్ 2 కింద 6వ కారిడార్‌ను 7.5 కిలోమీటర్ల మెట్రో నిర్మాణ పనులు ఎంజిబిఎస్ నుండి చంద్రయాణగుట్ట వరకు నాలుగు సంవత్సరాలలో రూ.2,741 కోట్లతో ప్రభుత్వం చేపట్టనున్నట్లు తెలిపారు. మొత్తం 7.5 కిలోమీటర్ల మేరకు మెట్రో లైన్ అలాగే స్టేషన్లను సాలర్ జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఆలియాబాద్, ఫలక్ నుమాలలో చేపట్టడం జరుగుతుందని అన్నారు. అర్హులైన ప్రాంత వాసులకు మెట్రో స్టేషనలలో ఉపాధి కల్పించాలని అన్నారు. లబ్దిదారులకు గజానికి 60 వేలు చెల్లించవలసి ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు సూచనల మేరకు గజానికి 81 వేలు పెంచి అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. మెట్రో ఎం.డి ఎన్‌విఎస్ రెడ్డి మాట్లాడుతూ ఓల్డ్ సిటీలో రూ.2741 కోట్లతో అత్యంత ఉన్నత ప్రమాణాలతో చేపట్టే మెట్రో లైన్ కారిడార్ 6ను నాలుగు సంవత్సరాలలో పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. పాత బస్తీ మెట్రో నిర్వాసితులను ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరం విశ్వ నగరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో ఓల్డ్ సిటీ మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మెట్రో లైన్ కింద ఇండ్లు, స్థలం కోల్పోయిన వారికి నష్ట పరిహారం వేగవంతంగా అందచేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మెట్రో భూ సేకరణ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వర్ణలత, ఆర్డిఓ రామకృష్ణ, జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

లొట్టపీసు కేసుకు లాయర్ ఎందుకు కేటీఆర్

ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించిన కేసును లొట్టపీసు కేసు అన్న కేటీఆర్‌కు విచారణలో ఆయన పక్కన లాయర్‌ను ఎందుకు పెట్టుకున్నారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. నేనే డబ్బులు ఇచ్చాను ఏం చేస్తారో చేసుకోండి అంటూ అహంకారంగా మాట్లాడిన కేటీఆర్‌కు ఇప్పుడు లాయర్ల అవసరం ఏముందని నిలదీశారు. సోమవారం నాడు సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విచారణ సమయంలో పక్కన లాయర్ ఉండాలన్నది తప్పనిసరి కాదని, మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కు అంత మాత్రం తెలియదా అని జడిగారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో రూ.600 కోట్ల కుంభకోణం జరిగిందని మేము ఆరోపిస్తున్నామని చెప్పారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో అనేక ఉల్లంఘనలు ఉన్నాయని ఆరోపించారు. విచారణ జరిపించాలని హరీష్ రావు అసెంబ్లీలో చేసిన డిమాండ్ ఆధారంగానే చర్యలు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఇందులో ప్రివిలైజ్ మోషన్ ఇవ్వడానికి అవకాశాన్ని పరిశీలిస్తున్నామని, అదేసమయంలో ఫార్ములా ఈ రేస్ నుంచి కొన్ని సంస్థలు విచిత్రంగా తప్పుకున్నాయన్నారు. ఇంటి పైన డ్రోన్ ఎగురవేసినందుకు అప్పట్లో రేవంత్ రెడ్డిని 14 రోజులు జైలు పంపించారని గుర్తు చేశారు. కానీ అపుడు రేవంత్ రెడ్డి కేటీఆర్ మాదిరిగా లాయర్లను వెంట పెట్టుకుని వెళ్లలేదని తెలిపారు. చట్టప్రకారం మా రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లారని, కేటీఆర్ ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. సిరిసిల్ల భూకుంభకోణాలు బయటకు వస్తున్నాయని చెపుకొచ్చారు.. మున్సిపల్ మంత్రిగా వేల కోట్ల కుంభకోణాలు చేశారన్నారు. సిరిసిల్లలో కేటీఆర్ అనుచరులు ఆక్రమించుకున్న భూములు వెనక్కి ఇస్తున్నారని ఆరోపించారు. ఏసీబీ అధికారులు నిజాయితీతో విచారణ జరుపుతున్నారని, లాయర్లు విచారణలో నీ వెంట ఉండాలని హైకోర్టు చెప్పిందా అని నిలదీశారు. ప్రతిపక్షంలో కేటీఆర్ ఇమడలేకపోతున్నాడని, కేటీఆర్ స్వయం ప్రకాశిత నేతకాదన్నారు. ఇతరుల పైన ఆధారపడి కేటీఆర్ రాజకీయాలు చేస్తున్నారని, కవిత వెంట లాయర్లు విచారణ కు ఢిల్లీ వెళ్లినా ఆమె తీహార్ జైలుకు వెళ్లక తప్పలేదని కావున చట్టానికి లోబడి కేటీఆర్ విచారణకు హాజరుకావాలని సూచించారు. గ్రీన్ కో సంస్థకు, కేటీఆర్‌కు ఉన్న సంబంధం అందరికీ తెలుసని ముమ్మాటికీ కేటీఆర్ గోల్డెన్ స్వాన్ రాజకీయ నాయకుడని అన్నారు.

ఒప్పంద జీవోలు విడుదల చేయాలి

కార్మిక సంఘాల డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ పౌరసరఫరాల సంస్థ మరియు జిసిసి హమాలి కార్మికులకు 2024-2025 ఎగుమతి దిగుమతి రేట్ల పెంపుకై 2024లో జరిగిన ఒప్పంద జీవోను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని వామపక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల ఎగుమతి దిగుమతి రేట్ల పెంపు, తదితర డిమాండ్స్ సాధనకై రాష్ట్ర వ్యాప్తంగా ఆరు రోజులుగా చేస్తున్న నిరవధిక ఆందోళన బాగంగా సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఐటీయూసీ, సిఐటియూ, టియూసిఐ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి, సిఐటియు, టియుసిఐ జిల్లా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ పౌరసరఫరాల సంస్థలో హమాలి కార్మికులకు 2024, 2025 ఎగుమతి దిగుమతి రేట్ల పెంపుకు సంబంధించి రేట్ల పెంపు ఒప్పందం జరిగి ఏడాది గడుస్తున్న ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి జీవో కూడా విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న 26 రూపాయల నుంచి 29 రూపాయలు పెరిగిందని, ఈ పెరిగిన రేట్లను 2024 జనవరి నెల నుండే ఏరియర్స్‌తో సహా అందజేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. మహిళా స్వీపర్లకు గోదాముల సామర్థ్యాన్ని బట్టి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనానికి మరో వెయ్యి రూపాయలు అదనంగా చెల్లిస్తామని, బోనస్ 6500 నుండి 7500 చెల్లిస్తామని, యూనిఫామ్ కుట్టుకూలీ 1300 నుంచి 1600 లకు, దసరా పండుగకు ఇచ్చే స్వీట్స్ బాక్స్ 800 నుండి 900కు పెంచుతూ, సివిల్ సప్లయ్ హమాలీల వలె జిసిసి హమాలీలకు పీఎఫ్ సౌకర్యం కల్పన వంటి అనేక సదుపాయాలు ఒప్పందంలో చేర్చబడ్డాయని అన్నారు. వారి న్యాయమైన సమస్యల సాధనకై జనవరి ఒకటి నుండి ఇరవధిక ఆందోళనలకు దిగిన సివిల్ సప్లయ్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం విడ్డూరం అన్నారు. తక్షణమే జీవో విడుదల చేసి కార్మికుల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సిఐటియూ టియూసిఐ సంఘాల నేతలు పి.సురేష్, నల్లవెళ్ళి కురుమూర్తి, వెంకటేష్, చంద్రకాంత్, రాజు, బుట్టో తదితరులు పాల్గొన్నారు.

వికాస్ నీతి యాప్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తన నియోజక వర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వికాస్ నీతి అనే యాప్ యాప్‌ను మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుండి ప్రజలు డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడ ఏ సమస్య ఉన్నా ఆ ఫోటోను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లైతే ఆ సమస్య ఎమ్మెల్యే దృష్టికి వెళ్తుంది. ఆ సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారు. సమస్య పరిష్కరం అయిన తరువాత ఆ ఫోటును అప్‌లోడ్ చేయడం జరుగుతుంది. సమస్య పరిష్కారానికి ఈ విధమైన యాప్‌ను రూపొందించి ప్రజలు తన వద్దకు రాకపోయిన సమస్య పరిష్కారం అయ్యేందుకు ఈ యాప్‌ను రూపొందించినట్లు ఎమ్మెల్యే మర్రి రాజ శేఖర్ రెడ్డి తెలిపారు. మల్కాజిగిరి నియోజక వర్గంలో అంటేనే సమస్యల వలయంగా ఉన్న సమయంలో తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని అన్నారు. ఒక్కొక్కటిగా ప్రతి సమస్యను ఉన్నతాదికారులు, సంబంధిత మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని, శాసనసభలో గిగ్ అండ్ ప్లాట్ ఫామ్ వర్కర్స్ సమస్య తాను ప్రస్తావించగా పరిష్కారం అయ్యిందని, నార్త్ హైదరాబాద్ ప్రజలకు మెట్రో రైల్ ఆవశ్యకతను ప్రస్తావిస్తే ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి డి.పి.ఆర్.లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. పేద బ్రాహ్మణ విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ పంపిణీలో అధికారులు అలస్యం ప్రదర్శిస్తున్నారని ప్రస్తావించిన వెంటనే బ్రాహ్మణ పరిషత్‌కు వైస్ చైర్ పర్సన్‌గా శైలజ రామయ్యర్‌ను నియమించారని తెలిపారు. రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని అసెంబ్లీ సాక్షిగా గళం వినిస్తే సంబంధిత మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయంతో పేద ప్రజలు కష్టపడి కొనుకున్న ఆస్తులపై హక్కును కోల్పోతారని ప్రస్తావించగా సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తామని వెల్లడించిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి చేశానని, ప్రభుత్వ భూములు కబ్జా నుండి కాపాడేందుకు విశేషాంగ కృషి చేస్తున్నానని, మల్కాజిగిరి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఎకరానికి రూ.12 వేలు : ఎమ్మెల్యే వీర్లపల్లి

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేలు ఇస్తాం రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలని నిలబెట్టుకున్నది అన్నారు. పదేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించిందని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం అడ్డగోలు వ్యవహారాలు కమీషన్లకు కక్కుర్తిపడి అడ్డమైన పనులు చేయడంతో రాష్ట్రం ఆర్థికంగా కుప్పకూలిపోయిందన్నారు. రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పులతో ఉన్న సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అయినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే విషయంలో ఎక్కడ వెనుకడుగు వేయడం లేదన్నారు. ఆర్థిక సమస్యలున్నా అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింద న్నారు. గత ప్రభుత్వం భూస్వాములకు పెట్టుబడిదారులకు రాళ్ల రప్పలు గుట్టలు చెట్లు పుట్టలకు రైతుబంధు పేరిట కోట్ల రూపాయలు దారదత్తం చేసిందని అన్నారు. రూ.22 వేల కోట్లతో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో క్వింటాలు రూ.500 బోనస్ ఇచ్చామని గతేడాది రైతు భరోసా ఇచ్చాం. ఈ నెల 26 నుంచి ఎకరాకు రూ.12 వేలు ఇస్తాం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నయ్ అన్నారు. ప్రతిపక్షాల తీరును ప్రజలు గమనిస్తున్నరన్నారు.ఈ కార్యక్రమంలో కే.చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, రఘు, బస్వం తదితరులు పాల్గొన్నారు.

జీఐజీ కార్మికుల స్థితిగతులపై సెమినార్

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: జీఐజీ ఎకానమీ, జీఐజీ కార్మికుల స్థితిగతులపై "జీఐజీ ఎకానమీ: సవాళ్లు, అవకాశాలు, విధాన పరిష్కారాలు" అనే పేరుతో ఒక సెమినార్‌ను సీఆర్ ఫౌండేషన్ హైదరాబాద్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ ఈనెల 4న నిర్వహించింది. ఈ సెమినార్‌లో కొంతమంది జీఐజీ కార్మికులు, క్యాబ్ డ్రైవర్లు, ఆల్ ఇండియా జిఐజి వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కీలకమైన అంశంపై రెండు తెలుగు రాష్ట్రాలలో ఇటువంటి మేథో, నిపుణుల స్థాయి పరస్పర చర్చ నిర్వహించడం ఇదే తొలిసారి. సెమినార్‌లో పాల్గొన్న వారిని స్వాగతిస్తూ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ ఈ రోజు మన ఆర్థిక వ్యవస్థలోని రిటైల్ సేవా రంగంలో జీఐజీ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పాత్ర పోషిస్తోందని తెలియజేశారు. నీతి ఆయోగ్, నిపుణుల అభిప్రాయం ప్రకారం, జీఐజీ ఆర్థిక వ్యవస్థ గత దశాబ్దంలో 450 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 37 లక్షల కోట్లు) టర్నోవర్‌తో దేశంలో వేగంగా అభివృద్ధి చెందింది, 77 లక్షల మంది తాత్కాలిక కార్మికులు, ఫ్రీలాన్సర్లకు ఉపాధి కల్పిస్తోంది. భారతదేశంలో, ఈ సంఖ్య 2029-30 నాటికి 2.35 కోట్లకు లేదా మొత్తం శ్రామిక శక్తిలో 4.1 శాతానికి పెరుగుతుందని అంచనా వేయబడింది. అయినప్పటికీ, కార్మికులు అసంఘటితంగా ఉన్నారు మరియు కనీస వేతనం, ఇతర ప్రయోజనాలు లేని కష్టతరమైన పని పరిస్థితులను తరచుగా ఎదుర్కొంటున్నారు. నేడు డిజిటల్ పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారీ విధానం కార్మికుల దోపిడీ మరింత తీవ్రంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. సెమినార్‌లో పాల్గొన్నా వారితో ఈ జీఐజీ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఇంటరాక్టివ్ చర్చజరిపారు. ఎఐటీయూసీ నాయకుడు వెంకటేష్, జీఐజీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ కార్మికుల సమస్యలపై జీఐజీ యూనియన్‌లకు చెందిన షేక్ సలుద్దీన్, ఇతర నాయకులతో సంయుక్తంగా పోరాటం చేయడం గురించి తన అనుభవాలను పంచుకున్నారు. ఆవశ్యకతను ఉద్బోధించారు. ఐక్య కార్యాచరణ ప్రణాళిక గిగ్ వర్కర్ యూనియన్లు నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధనా కేంద్రం ఈ సెమినార్‌ను నిర్వహించడం పట్ల ఎంతో ప్రశంసించాయి.

ఉత్తమ లయన్ జోన్ చైర్మెన్‌గా కొండ విజయ్ కుమార్

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: లయన్స్ క్లబ్ ఉత్తమ జోన్ చైర్మెన్‌గా చందానగర్ కు చెందిన కొండ విజయ్ కుమార్ ఏంపికయ్యారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మెన్ గా 6 మెలల క్రితం భాధ్యతలు స్వీకరించిన కొండ తన జోన్ పరిధిలోని క్లబ్‌లతో పాటు క్లబ్ సభ్యులచే సేవా కార్యక్రమాలతో పాటు లయన్స్ సేవలను మరింత విస్తృతం చేయడంలో చేసిన కృషి పట్ల కొండ విజయ్‌కు అవార్డు అందచేసినట్లు లయన్స్ రీజియన్ చైర్మెన్ కరుణాకర్ గౌడ్ తెలిపారు. లయన్ ఇంటర్ నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమ నేను బాబురావు చేతుల మీదుగా కొండ విజయ్ కుమార్ అవార్డును అందుకున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరా నగర్ కాలనీలో సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వహించడం జరిగినది. కె.ప్రమీల అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శిలు డి దామోదర్ రెడ్డి, ఉమామహేష్ పాల్గొనడం జరిగినది. ఇరువురు మాట్లాడుతూ మేడిపల్లి మండలంలో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని మరియు ప్రభుత్వ భూములు భూకబ్జాదారులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని భూకబ్జాదారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలామంది ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న కొంతమందిని గుర్తించడం వలన పేదలకు అన్యాయం జరుగుతుందని. మరల ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిని మరల పరిశీలించి లబ్ధిదారులను కంప్యూటర్‌లో ఫీడ్ చేయాలని అన్నారు. జంట కార్పొరేషన్‌లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న కార్పొరేషన్ కమిషనర్లు చూసిచూడనట్టు వదిలేయడంతో కార్పొరేషన్‌కి భారీ ఆదాయానికి గండి పడుతుందని వెంటనే ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని తెలియజేయడం జరిగినది. చర్యలు తీసుకొని ఎడల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేయడం జరుగుతుందని హెచ్చరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి జె లక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు వి.బి.బాలరాజ్, బాపురాజు, సిహెచ్ మాధవి, కే మహాలక్ష్మి, దండు రమేష్, బి ఐలయ్య, కొమురయ్య, ఎండి అన్వర్, జి నాగరాజు, కనకయ్య, ఇస్తారు, సోమరాజు, బొందయ్య, మహేశ్వరి, జ్యోతి, పి ఆండాలు, భూతం నరేష్, దండు మదర్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-21, ఇతర శాఖలకు-31, మొత్తం 52 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరిలో :

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్‌ఓ హరిప్రియతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (114) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ప్రజల పక్షాన నిలబడే పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : సమస్యలేవైనా ప్రజల పక్షాన నిలబడే పత్రిక విశాలాంధ్ర అని కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కౌసల్య కాలనీలో స్థానిక కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ చేతుల మీదుగా విశాలాంధ్ర నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దిశ కుత్బుల్లాపూర్ జోన్ ఇంచార్జ్ లింగస్వామి, విశాలాంధ్ర విలేకరి శంకర్, రామకృష్ణ రెడ్డి, ప్రవీణ్, నాయకులు జల్లారి రమణ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లుకై కేంద్రంపై వత్తిడి పెంచాలి: ఎంపీ కృష్ణయ్య

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : పార్లమెంటులో బిసి బిల్లు పెట్టి చట్ట సభలలో బిసిలకు 50 శాతం రిజవేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బోసు దుర్గా నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బిసిల అభివృద్ధికి విద్యా అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపాందించాలన్నారు. ప్రత్యకంగా కేంద్ర స్థాయిలో స్కాలర్ షిప్ లు, ఫీజుల రియంబర్స్ మెంట్, ఉపాధి రంగంలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెటులో రూ.20 వేల కోట్లు కేటాయించాలని అన్నారు. స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు 20 నుంచి 40 శాతంకు పెంచాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా ఎంపికైన బోసు దుర్గా నరేష్ మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్ళి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకొని రావాలని కోరారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ చింత శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు భీమవరపు హేమ, మెండు జ్యోతి, వనమాల శ్రీనివాస్, గజేంద్ర, బొరిగే మల్లేష్, పగిళ్ల సతీష్, పాల్గొన్నారు.

ఘనంగా బిక్షపతి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మాజీ శాసనసభ్యులు, బిజెపి సీనియర్ నాయకులు మారబోయిన బిక్షపతి యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గోపనపల్లిలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాల్వాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ బిక్షపతి యాదవ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని, ఆయన చూపించిన మార్గంలో ప్రజలకు సేవ చేయాలని అభిలషిస్తున్నానని తెలిపారు. తన గురువు బిక్షపతి యాదవ్ పుట్టినరోజు నాడే తనపుట్టిన రోజు కూడా కావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్ ఆశీస్సులతోనే తన రాజకీయ ప్రస్థానం మొదలయిందన్నారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : లూయిస్ బ్రెయిలీ 216వ బ్రెయిలీ జయంతి ఉత్సవాలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలంగాణ జోనల్ ఆఫీసులో పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హ్యూమన్ రిసోర్స్ డిపార్ట్మెంట్ చీఫ్ మేనేజర్ దినేష్ కుమార్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనటువంటి తెలంగాణ జోన్ జనరల్ మేనేజర్ అజయ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జనరల్ మేనేజర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ వికలాంగులకి సమాన అవకాశాలు కల్పించడంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. తాను పని చేస్తున్న క్రమంలో అనేక మంది వికలాంగుల ఉద్యోగులనుతో కలిసి పని చేసినటువంటి అనుభవంలో వారి నుండి ఒక చక్కటి మనోధైర్యం నేర్చుకున్నానని, శరీర అవయవ లోపం ఉన్నప్పటికీ శరీర అవయవ లోపంతో కృంగిపోకుండా బాధపడకుండా పట్టుదలతో పని చేసేటువంటి ఎంతోమంది విభిన్న ప్రతిభావంతులైన ఉద్యోగుల నుండి ప్రేరణ పొందే వాళ్ళమని వాఖ్యానించారు. అందరికీ సమానమైన మానసిక శారీరక శక్తిసామర్థ్యాలు సమానంగా ఉండవని వైకల్యం అనేది కేవలం అది ఒక శారీరకపరమైనటువంటి సమస్య మాత్రమే మానసిక పరమైనటువంటి శక్తిసామర్థ్యానికి శారీరక వైకల్యం అడ్డంకి కాదని చాలామంది నిరూపించారని, వారి నుండి మనందరం ప్రేరణ పొందాలని అన్నారు. ఐదవ అతిపెద్ద బ్యాంక్ అయినటువంటి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పుడు వికలాంగులను అర్థం చేసుకోవడంలోనూ, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడంలోనూ, వారిని ప్రోత్సహించటంలోనూ వారికి సమాన అవకాశాలు కల్పించడంలో ముందు వరసలో ఉంటుందని అజయ్ కుమార్ తెలిపారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ వెంకట నాగేష్ మాట్లాడుతూ వైకల్యాలు కలిగినటువంటి ఉద్యోగులకి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొదటి ప్రాధాన్యతను కల్పిస్తుందని ఉద్యోగులనే కాకుండా వైకల్యాలు కలిగినటువంటి కస్టమర్లకు కూడా వారి వైకల్యాలను

దృష్టిలో పెట్టుకొని వారికి తగిన రీతిలో ప్రాథమిక ప్రాముఖ్యతని కల్పిస్తుందని, అందులో భాగంగానే దృష్టిలోపం గల ఉద్యోగులని కస్టమర్లని దృష్టిలో పెట్టుకొని భారతదేశ బ్యాంకింగ్ రంగంలోనే మొట్టమొదటిసారిగా బ్రైలీ లిపిలో ముద్రించినటువంటి స్పర్శ డెబిట్ కార్డు పేరుతో ప్రత్యేకమైనటువంటి ఏటీఎం కార్డుని దృష్టి వైకల్యం కలిగినటువంటి కస్టమర్లు సౌకర్యం కోసం రూపొందించడం జరిగింది. వైకల్యం కలిగినటువంటి ఉద్యోగుల పట్ల బ్యాంకు మేనేజ్మెంట్ ఎల్లప్పుడు సానుకూల దృక్కోణంలో వ్యవహరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాజశ్రీ, చీఫ్ మేనేజర్ రవికుమార్, జోనల్ కార్యాలయ సిబ్బంది, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు ఆర్.స్వామి నాయక్ మరియు రాష్ట్ర నాయకత్వం హరిలాల్ రంగప్ప, శివదేవ్ సింహాచలం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతు భరోసా నిధుల కోతపై ధర్నా

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: దేశ నాయకులతో రైతులకు అడ్డగోలుగా హామీలు ఇచ్చి, దేవుళ్ళపై ఒట్లు వేసి, చివరకు ఆర్థిక పరిస్థితుల పేరుతో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తూ పథకాలకు కోతలు పెడుతున్నారని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ యువ నాయకుడు వై.రవీందర్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తహసిల్దార్ కార్యాలయం ముందు రైతు భరోసానిధుల కోతపై నిర్వహించిన బీఆర్ఎస్ ధర్నాలో హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీల నుంచి, అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటమారుస్తూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన రైతులకు చేసింది ఏమీ లేదని ఏ ఒక్క గ్రామంలో రుణమాఫీ కూడా కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు రైతు రుణ మాఫీ పథకంతో ప్రజలను మోసం చేసే విధంగా ప్రచారాలు చేసి, రైతులను మోసం చేశారని, ఇదే తరహాలో మరో మారు రైతు భరోసా పథకంతో స్థానిక సంస్థల ఎన్నికల్లలో గెలవాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ఆయన మోసపూరిత ప్రయత్నాన్ని తెలంగాణ రైతులు గ్రహించారని చెప్పారు. ఎన్నికలకు ముందు రైతు భరోసా ద్వారా ఎకరం భూమికి 15వేలను పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి, నేడు 12000 ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేసినట్లు కాదా, అని ప్రశ్నించారు. కనీసం ప్రజల సమస్యలపై కూడా దృష్టి పెట్టే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని వాపోయారు. ఏడాది గడుస్తున్న తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు, ఇంటర్,డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు 4000 పింఛన్లు, మహిళలకు 2500 ఆర్థిక సాయం వంటి పథకాలు ఏమయ్యాయి అని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా నిధులు మంజూరు చేయకుంటే రైతులు తిరగబడతారన్నారు. మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, సీనియర్ నాయకులు వంకాయల నారాయణ రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, లక్ష్మీనారాయణ గౌడ్, మిట్టు నాయక్, దేవేందర్ యాదవ్, సత్యం, శ్రీధర్ రెడ్డి, హఫీజ్, లక్ష్మణ్ నాయక్, వీరేశం, తాండ్ర వెంకట్ రెడ్డి, బక్కన్న యాదవ్, జగదీశ్వర్ గౌడ్, రంగయ్య గౌడ్, హాఫిజ్, ముస్తఫా, యుగేందర్, జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు,అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల మీద కపట ప్రేమ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏసీబీ విచారణను ఎదుర్కోలేక బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల మీద కపట ప్రేమ వలకబోస్తున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏసీబీ విచారణను కప్పిపుచ్చుకునేందుకు నిరసనల పేరుతో డ్రామాను మొదలుపెట్టారని విమర్శించారు. ఏకకాలంలో రుణమాఫీ జరగడం, రైతు భరోసాపై ముఖ్యమంత్రి చేసిన ప్రకటనతో సంతోషంలో రాష్ట్ర రైతాంగం ఉండడంతో బిఆర్ఎస్ నిరసనలను పట్టించుకునే పరిస్థితిలో రైతులు లేరన్నారు. కేసీఆర్ కుటుంబం తల కిందులుగా తపస్సు చేసిన రైతాంగం నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ ని 20616.89 కోట్ల బడ్జెట్ తో 25,35,963 మంది రైతులకు రుణమాఫీ చేశామని వివరించారు. అలాగే కేసీఆర్ ఎగ్గొట్టిన రైతుబంధు ను రూ.7,625 కోట్ల బడ్జెట్ కేటాయించి 69 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించామన్నారు. రైతు భరోసా సాయానికి ఎలాంటి షరతులు లేవని, ముఖ్యమంత్రి రైతు భరోసా రూ.6 వేలకు పెంచి, చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. దాదాపు రూ.10,000 కోట్ల రూపాయలను జనవరి 26 నుంచి రైతు భరోసా ను రైతుల అకౌంట్లో వేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీ మేరకు రిపబ్లిక్ డే నాడు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని నిరుపేద వ్యవసాయ కూలీల కుటుంబాలకు రూ.12000 నగదు సహాయం చేస్తున్నట్లు వెల్లడించారు. రైతు బీమాకు రూ.1,455 కోట్లు వెచ్చించి దాదాపు 43 లక్షల మంది రైతులకు బీమా కవరేజీ ఇచ్చామని చెపుకొచ్చారు. పంటల బీమాకు రూ. 1,300 కోట్లు, వ్యవసాయ ఉచిత విద్యుత్ కు రూ.10,444 కోట్లు, సన్న వడ్లకు రూ.500 చొప్పున రైతులకు బోనస్ రూ. 1080 కోట్లు వెచ్చించి నాలుగు లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చి రైతుల కళ్ళల్లో వెలుగులు నింపామన్నారు. అదేసమయంలో వరదల వల్ల జరిగిన పంట నష్టానికి ఎకరానికి రూ.10 వేల చొప్పున 94672 మంది రైతులకు రూ.95.38 కోట్ల ఆర్థిక సాయం చేశమన్నారు. హార్టికల్చర్, ఆయిల్ పామ్ సాగుకు రూ.277 కోట్ల సబ్సిడీ, ఎరువుల తయారీకి సబ్సిడీ రూ.65 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం గా రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం రూ. 53,758.27 కోట్లు ఖర్చుచేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పదేండ్లు మాటలతో మోసం చేసి, లక్ష రూపాయలు కూడా రుణమాఫీ చేయలేని కేటీఆర్, హరీశ్‌రావు అడ్డగోలుగా మాట్లాడుతున్నరని విమర్శించారు. కేసీఆర్ అప్పుల దరిద్రాన్ని నెత్తినపెట్టి పోయిన, ఆర్థిక పరిస్థితి బాగలేకున్నా రైతులను ఆదుకుంటున్నామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పు చేయడంతో దాని వడ్డీలకే రూ.6,500 కోట్లు వడ్డీ కడుతూనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చెపుకొచ్చారు.

ఈవీ విప్లవాన్ని చేరువ చేసిన గ్రావ్టన్ మోటార్స్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : హైదరాబాద్‌కు చెందిన ఫుల్-స్టాక్ ఈవీ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ, సుస్థిర మొబిలిటీలో అగ్రగామి అయిన గ్రావ్టన్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కరీంనగర్‌లో తన మొదటి కంపెనీ యాజమా న్యంలోని అవుట్‌లెట్‌ను ప్రారంభించడం ద్వారా ఒక చారిత్రాత్మక సందర్భాన్ని నమోదు చేసింది. ఈ మైలు రాయి గ్రావ్టన్ ప్రయాణాన్ని వేడుక చేసుకుంటూనే భారతీయ ఈవీ రంగంలో భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పునాది వేసింది. ఈ షోరూమ్ ప్రారంభం కరీంనగర్‌లో చోటు చేసుకున్నప్పటికీ, సిద్ధిపేట ప్రాంతం కూడా గ్రావ్టన్ వృద్ధికి తోడ్పడే అపార శక్తిసామర్థ్యాలను కలిగి ఉందన్నారు. సిద్ధిపేటకు చెందిన వినియోగదారులు గ్రావ్టన్ నమ్మకమైన విక్రయా నంతర సేవలను సులభంగా పొందవచ్చు. సర్వీస్ సంబంధిత సమస్యలు 24 గంటల్లోగా పరిష్కరించబడు తాయన్నారు. ఈ బ్రాండ్ కొనుగోలుదారు కేంద్రిత ధోరణిని ఇది ప్రతిబింబిస్తుంది. గంగుల కమలాకర్, ఎమ్మెల్యే, కరీంనగర్ నియోజకవర్గం, తెలంగాణ పాల్గొన్నారు. భారతదేశ భవిష్యత్ చలనశీలతను నడపడంలో సుస్థిర ఆవిష్కరణల ప్రాముఖ్యతను ఆయన అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకులు, సీఈఓ పరశురామ్ పాకా తన చిన్ననాటి ఉపాధ్యాయునికి మొదటి రిజిస్టర్డ్ గ్రావ్టన్ క్వాంటా ఈవీ మోటార్‌సైకిల్‌ను బహుకరించారన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకులు సీఈవో పరశురామ్ పాక మాట్లాడుతూ ఇది కేవలం వ్యాపార మైలురాయి కాదు, ఇది ఈ ప్రాంతానికి పెద్ద కలలు కనడానికి నన్ను ప్రేరేపించిన వ్యక్తులకు కృతజ్ఞతలు తెలియజేసుకోవడం అని

అక్రమాల చిత్రపురి కమిటీని రద్దు చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : చిత్రపురి కాలనీ, డా. ఎం. ప్రభాకర్ రెడ్డి సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో జరిగిన తెలంగాణాలో అతి పెద్ద కుంభకోణం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. బాలరాజ్, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నరసింహరావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, టీజెస్ నాయకులు నర్సయ్య, సీనియర్ రాజకీయ నాయకులా దేశ్ పాండే ప్రసంగించారు. ముందుగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ చిత్రపురి అవినీతి, అక్రమాలు తెలంగాణ రాష్ట్ర సిద్ధించిన తర్వాత జరిగిన అతి పెద్ద కుంభకోణం అని తెలిపారు. చిత్రపురి బాధితులకు అండగా ఉండటమే కాకుండా అవినీతి అధికారులను జైలుకు పంపించే వరకూ వదిలి పెట్టబోమని తెలిపారు. చరణ్ కౌశిక్ యాదవ్ చిత్రపురి కాలనీ కుంభకోణాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, కుంభకోణానికి పాల్పడ్డ సొసైటీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. డి జె నర్సింగరావు మాట్లాడుతూ ఇంత అవినీతి వింటుంటే అసలు మనం సమాజంలో ఉన్నామా అని అసహ్యం వేస్తోందన్నారు. ఎర్రజెండా బాధితులకు అండగా ఉంటుందని, చిత్రపురి అక్రమార్కుల భరతం పట్టేవరకూ వదిలేదు అన్నారు. సిపిఐ

ఇప్పటికే చిత్రపురి అవినీతి పై అనేక పోరాటాలు చేసిందని వివరించారు. దేశ్ పాండే మాట్లాడుతూ నేను గత నాలుగు సంవత్సరాల నుండి ఈ పోరాటంలో పాల్గొంటున్నానని, ప్రభుత్వ అధికారులు కోర్ట్ ఆదేశాలను దిక్కరిస్తుంటే ప్రభుత్వం ఏమి చేస్తోంది అని ప్రశ్నించారు. చిత్రపురి అక్రమాలపై అన్నీ పార్టీలతో జాయింట్ యాక్షన్ కమిటీ, ప్రస్తుత అక్రమాల చిత్రపురి కమిటీ ని రద్దు చేయాలనీ, అడ్ హాక్ కమిటీని ఏర్పాటు చేయాలనీ సీఎం రేవంత్ రెడ్డి కలిసి సమస్య తీవ్రత తెలియజేయాలనీ ఈ సమస్యపై టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ గౌడ్, టిజెఎస్ నేత ఎమ్మెల్సీ కోదండరాం, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆమ్ ఆద్మీ కన్వీనర్ దిడ్డి సుధాకర్, దేశ్ పాండే వెళ్లాలని ఈ సమావేశం నిర్ణయించింది. టీ ఎన్ జీ ఓ మాజీ నాయకులు శ్యాంరావ్, చిత్రపురి ఉద్యమకారులు కస్తూరి శ్రీనివాస్, సామాజిక ఉద్యమకారులు భద్ర, సీఐటీయూ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ నాయకులు సంకూరి రవీందర్, రమావేణి, రాజు, సినీ దర్శకులు కాట్రగడ్డ రవితేజ, మద్దినేని రమేష్, బాధితులు నిర్మల, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మేడిపల్లి: కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన ఆలయ కమిటీ చైర్మన్‌గా నారాయణ శర్మ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, ఇతర ప్రముఖులు, దేవాదయ శాఖ అధికారులు, పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిది... సీఎం సహాయనిధి...

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్: సీఎం సహాయనిధి నిరుపేదలకు పెన్నిదని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు సోమవారం 128 డివిజన్ చింతల్ వాసులు నర్సమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుటకు ఆర్థిక స్తోమత లేదని నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమస్యను తెలుసుకొని వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,00,000ల సీఎం సహాయనిధి - ఎల్వోసీని మంజూరి చేయించారు. అనంతరం రూ 2,00,000, సీఎంఆర్ఎఫ్, ఎల్వోసి మంజూరి పత్రాలను బాధితులకు కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయం ఎంతో సహాయపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఫాతిమాపూర్ గ్రామంలో 11వ వార్డు కౌన్సిలర్ బ్యాగరి ప్రసన్న లత ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. గ్రామంలోని కుమ్మరి లక్ష్మయ్య ఇంటి నుండి కమాన్ వరకు రూ.5 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులను చేపట్టినట్టు ఆమె తెలిపారు. లావణ్య మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగ ఉంచుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటామని అన్నారు. ప్రస్తుతం ప్రబలుతున్న వైరస్‌లకు గురికాకుండ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పట్టణంలో మురుగంధం ఉండకుండ అండర్ డ్రైనేజీ పనులను వేగవంతం చేశామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ఎన్ బాలాజి, వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్, జె శ్రీనివాస్, అల్విన్ రెడ్డి, దిలీప్ రెడ్డి, పీర్లగూడెం చంద్రయ్య, కుమ్మరి లక్ష్మయ్య, రాజి రెడ్డి, పీర్లగూడెం గోపాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: గోపనపల్లిలోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలలో గచ్చిబౌలి డివిజన్ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు "జై గంగాధర్" నినాదాల మధ్య ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కటింగ్ నిర్వహించి, పుష్పగుచ్చాలతో సత్కరించి, శాలువాలు కప్పి అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన వేడుకల్లో భాగంగా కార్పొరేటర్ ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ తనపై చూపిస్తున్న ప్రేమకు, నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ప్రజల ఆశీర్వాదాలు తనకు శక్తిని, ప్రేరణను అందిస్తున్నాయని, మరింత కష్టపడి ప్రజలకు సేవ చేయడానికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడం తన లక్ష్యమని చెప్పారు. ఈ వేడుకలు డివిజన్ ప్రజల్లో ఆనందాన్ని నింపగా ఒక పండుగ వాతావరణంలో ముగిసాయి.

జెపి దర్గాలో చౌలపల్లి ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండలం ఇన్ ముల్ నర్వ గ్రామ శివారులో గల హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాలో సోమవారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగ రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ దర్గాలో జరిగే ఉర్సు ఉత్సవాల్లో సమర్పించే చాదర్‌ను జెపి దర్గా ముస్లిం మతపెద్దల సమక్షంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనల అనంతరం సంప్రదాయబద్ధంగా సాగనంపారు. పలువురు ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాలతో పరిపూర్ణ విజ్ఞానం

జిల్లా కేంద్రాల్లోనూ పుస్తక మహోత్సవాలు అవసరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-గుణదల: నేటి యువతరం సెల్‌ఫోన్, టీవీ, కంప్యూటర్ వాడకంతో పాటు మంచి పుస్తకాలు చదవడంతో పూరిపూర్ణమైన విజ్ఞానాన్ని పొందవచ్చని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సూచించారు. 35వ పుస్తక మహోత్సవంలో భాగంగా పుస్తకాలపై అవగాహన పెంచేందుకు సోమవారం మొగల్‌రాజ్‌పురం వీపీ సిద్ధార్థ కళాశాల నుండి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం చెరుకూరి రామోజీరావు వేదికపై ఏర్పాటు చేసిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ పుస్తక మహోత్సవం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇంత వైభవంగా జరగడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కారణమన్నారు. ఆయనకు అభినందనలు తెలిపారు. ఇలాంటి పుస్తక మహోత్సవాలు, ప్రదర్శనలు ప్రతి జిల్లా కేంద్రంలో రాష్ట్రమంతా జరగాలని కోరారు. పుస్తకాల్లో ఉండే లోతైన విషయాలు చదివి... ఆకళింపు చేసుకొని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. పుస్తక రచయితలు మరింతగా రచనలు చేయటం వల్ల నవ సమాజ నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ పరిపూర్ణమైన వ్యక్తిగా ఎదగాలంటే మంచి పుస్తకాలు చదవాలని సూచించారు. గ్రంథాలయాలకు వెళ్లడాన్ని విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక ప్రదర్శన మహోత్సవంలో పాల్గొనటం సంతోషంగా ఉందని తెలిపారు. పవన్ కల్యాణ్‌కు పుస్తకాలు చదవటం ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తరపున పుస్తక మహోత్సవాలు ఎక్కువగా జరగడానికి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి ప్రకటించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవడానికి వయసు ప్రతిబంధకం కాదన్నారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, దాని వలన వ్యక్తి వికాసం పెరుగుతుందన్నారు. సాహితీవేత్త, రచయిత రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ తెలుగుభాషకు మరింత ప్రచారం జరగాలని, పాఠశాల విద్య నుండి తెలుగు భాషపై పిల్లలలో అవగాహన, ప్రేమ పెంచాలని సూచించారు. పుస్తక మహోత్సవాలు అన్నిచోట్ల పండుగలా జరగాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య యువ పురస్కారానికి ఎంపికైన రమేశ్, కార్తీక్ నాయక్‌లను ప్రముఖులు ఘనంగా సత్కరించారు. బుక్ ఫెస్టివల్ సోసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ విజయకుమార్, గౌరవ అధ్యక్షుడు బాబ్జి, గోళ్ల నారాయణరావు, డాక్టర్ సశ్రీ, రచయితలు, పుస్తక అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్‌కు ఊతం

నిబంధనలు సరళతరం చేస్తున్నాం

భవన నిర్మాణాలకూ కొత్త నిబంధనలు: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పెరగాలనే లక్ష్యంతో నిబంధనలు సరళతరం చేస్తున్నామని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పారు. రెరాలో అపరిష్కృతంగా ఉన్న పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై విజయవాడ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) కార్యాలయంలో మునిసిపల్ శాఖ కార్యదర్శి, రెరా చైర్మన్ కన్నబాబు, రెరా సభ్యులు, అధికారులతో కలిసి మంత్రి సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. క్రెడాయ్, నరెడ్కో ప్రతినిధులతో పాటు బిల్డర్లు, డెవలపర్లు, ప్రజల నుంచి మంత్రి నారాయణ స్వయంగా వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి పూర్తిగా వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు పెండింగ్‌లో ఎందుకు పెట్టాల్సి వచ్చిందో అధికారులను మంత్రి వివరణ అడిగారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ భవనాలు, ప్లాట్లు కొనుగోలు చేసేవారు ప్రకటనలు చూసి మోసపోకుండా ఉండేలా రెరా అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర చట్టం ప్రకారం రాష్ట్రంలో 2016లో రెరా అమలులోకి వచ్చిందని, అప్పటి నుంచి కేంద్రం ఇచ్చిన నిబంధనలు రాష్ట్రంలో తూ.చ. తప్పకుండా అమలు చేసేలా ముందుకువెళుతున్నామని తెలిపారు. రెరాలో ఇప్పటి వరకు 167 దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొన్ని దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులు రావడంతో ఈ రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని మంత్రి వెల్లడించారు. పెండింగ్ దరఖాస్తులన్నింటినీ ఈ నెలాఖరులోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెరా నిబంధనలు మరింత సరళతరం చేసేలా కమిటీ వేసి ముందుకు వెళతామన్నారు. అలాగే అనుమతులు కూడా ఆఫ్ లైన్‌లో కాకుండా ఆన్ లైన్‌లో జరిగేలా త్వరలో మార్పులు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో బిల్డర్లు, డెవలపర్లతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పెరగాలనేది ముఖ్యమంత్రి లక్ష్యమని... అందుకు అనుగుణంగా భవన, లేఅవుట్ల అనుమతులను సరళతరం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవన నిర్మాణాలకు సంబంధించి కొత్తగా రూపొందించిన నిబంధనలను వచ్చే గురువారం జారీ చేస్తామని మంత్రి చెప్పారు. బిల్డర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. తణుకు, తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలు జరగడంతో వాటితో పాటు కొన్నాళ్లపాటు అన్నిచోట్లా బాండ్ల జారీ నిలిపివేశామన్నారు. తాజాగా ఒకట్రెండు చోట్ల మినహా మిగిలిన అన్నిచోట్లా పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లను జారీ చేస్తున్నామని మంత్రి వివరించారు. రాష్ట్రంలో అనధికారిక, అక్రమ లే అవుట్లు ఎన్ని ఉన్నాయనే దానిపై ఇప్పటికే స్పష్టత వచ్చిందని, వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. భవన, లేఅవుట్ల క్రమబద్ధీకరణపై కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధ్యయనం చేస్తున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు.

విశ్వసనీయత కోల్పోయిన మీడియా

జర్నలిస్టుల హత్యలు పెరిగాయన్న సంజయ్‌బారు

విశాలాంధ్ర- హైదరాబాద్: ఎమర్జెన్సీ నాటికంటే ఈ కాలంలో ఎక్కువ మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని సీనియర్ జర్నలిస్ట్ సంజయ్ బారు అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ద వైర్ తెలుగు ప్రారంభ సభకు వైర్ తెలుగు ఎడిటర్ కొండూరి వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్ బారు మాట్లాడారు. నేటి ప్రభుత్వాల కారణంగా ఎమర్జెన్సీ నాటికంటే వందమందిపైగా జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని సంజయ్‌బారు చెప్పారు. ప్రధాన ప్రవంతి మీడియా విశ్వసనీయత కోల్పోయిందని, స్వతంత్ర జర్నలిస్టులు ధ్రువరాఠీ, రవీశ్ కుమార్, సిద్ధార్థ వరదరాజన్ వంటి వారే ప్రజలకు నమ్మకమైన వార్తలు అందిస్తున్నారని అన్నారు. తెలుగులో ద వైర్ రావటం తెలుగు ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ద వైర్ ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్ మాట్లాడుతూ వైర్‌ను తెలుగులో ప్రారంభించటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో ధైర్యవంతమైన జర్నలిజం అవసరమని, ద వైర్ పెట్టుబడుదారుల, రాజకీయ నాయకుల పాత్రను తొలగించి ప్రజలపై ఆధారపడే, ఉపయోగపడే జర్నలిజాన్ని నమ్ముతుందని అన్నారు.

వైర్ వ్యవస్థాపక సంపాదకులు ఎంకే వేణు మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా చెప్పటం వలన తాము పదకొండువేల కోట్ల రూపాయల నిందానువాద కేసులు ఎదుర్కొంటున్నామని అన్నారు. రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ నకిలీ వార్తలను ఒక ఆర్మీ ద్వారా నిర్వహించబడుతున్న ఈ రోజుల్లో వైర్ కేంద్ర ప్రభుత్వానికి నిజమైన ప్రతిపక్షమని అన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీ ఉపకులపతి ఘంటా చక్రపాణి మాట్లాడుతూ వైర్ తెలుగు సమాజానికి మేధోసంపత్తిని అందిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ తెలంగాణ సమాజానికి నిజమైన జర్నలిజం అవసరమని అన్నారు.

ది వైర్ ఎడిటర్ సీమా చిస్తీ మాట్లాడుతూ మీడియాలో క్రైమ్, సినిమా, క్రికెట్, జ్యోతిష్యం వంటివి కేంద్రీకృతమై ఉన్నాయని విమర్శించారు. శక్తివంతమైన పాలకులు ప్రతి చిన్న స్వరాన్ని అణచివేస్తున్నాయన్నారు. వార్తలు పాలకులకు అనుకూలంగా కాక ప్రజా ప్రయోజనంగా ఉండాలని ఆమె అన్నారు. సభకు వైర్ తెలుగు ఎడిటర్ ఐవీ రమణారావు స్వాగతం పలికారు. వైర్ తెలుగు వ్యవస్థాపక సభ్యులు నెల్లూరి నరసింహారావు, కాపు శ్రీనివాస్, కోయ చంద్రమోహన్ పాల్గొన్నారు.

పేర్ని నాని బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రేషన్ బియ్యం మాయం వ్యవహారంలో మాజీ మంత్రి పేర్ని నాని దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. అయితే పేర్ని నానిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దంటూ గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను 8వ తేదీ వరకు పొడిగించింది. రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని నానిని ఏ6గా చేరుస్తూ మచిలీపట్నం తాలూకా పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. నాని ఆదేశాల మేరకే లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసు నమోదవడంతో ఆయన ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించారు. కాగా గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై పట్టపగలే దాడి జరిగింది. కార్యాలయంలోని సామాగ్రిని ధ్వంసం చేయడంతో పాటు ఆవరణలో ఉన్న ఒక కారును కూడా దగ్ధం చేశారు. ఈ దాడి కేసులో ఇప్పటివరకు మొత్తం 89 మందిని నిందితులుగా చేర్చారు. వీరిలో 17 మంది హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీరి పిటిషన్లను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఇదే కేసులో 71 నిందితునిగా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఉన్నారు.

వైఎస్‌ఆర్ విద్యుత్ ఉద్యోగుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ ... 2025 డైరీ, క్యాలెండర్‌ను యూనియన్ గౌరవాధ్యక్షుడు, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆవిష్కరించారు. వైసీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గల్ల మహేశ్వర రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్రావుల మల్లికార్జునరెడ్డి, స్టేట్ చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మపురి వెంకటరమణ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.బాలాజీ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు తక్షణం కేటాయించాలి

సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ తక్షణం ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి ఇస్తామన్న రూ.4 లక్షల మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. ఇళ్ల స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు మొదటిదశగా నవంబరులో రాష్ట్ర వ్యాపితంగా గ్రామ సచివాలయాల వద్ద పేదలు ధర్నాలు నిర్వహించి, వ్యక్తిగత అర్జీలను సమర్పించారు. ఈ ఉద్యమం కొనసాగింపుగా ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు మండల రెవెన్యూ తహసీల్దార్‌లకు అర్జీలు సమర్పించడంలో భాగంగా సోమవారం విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు సీహెచ్ కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల విషయంలో హామీ తక్షణ అమలుకు ప్రభుత్వం పూనుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు టి.సుగుణకు వ్యక్తిగత అర్జీలను అందజేశారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఉప్పే నరసింహారావు ప్రసంగించారు. గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు భూక్యా దేశ్య, మహిళా సమాఖ్య గిరిజన నాయకురాలు లావూరి తీర్పి, వ్యవసాయ కార్మిక సంఘం గిరిజన విభాగ నాయకులు అజ్మీర బాలాజీ, భూక్యా అమ్రియ, జాటావతు బాలాజీ, తుపాకుల రాయప్ప, చవుటూరి రవి, కంపా లక్ష్మయ్య తదితరులు నాయకత్వం వహించారు.



క్రీడల్లో యువత భాగస్వామ్యం పెంపొందిస్తాం: గద్దె

విజయవాడలో జాతీయ వాలీబాల్ టోర్నీ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాల ఆవరణలో అండర్-19 బాలికల 68వ స్కూల్ గేమ్స్ జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా అండర్-19 యూనిట్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలను విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు ప్రారంభించారు. తొలుత రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వివిధ రాష్ట్రాల జట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అన్ని స్థాయిలలో క్రీడల్ని ప్రోత్సహించే లక్ష్యంతో పటిష్ట నూతన క్రీడా విధానాన్ని రూపొందించిందని వివరించారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రూ.లక్ష నుంచి రూ.7 కోట్ల వరకు నగదు బహుమతులతోపాటు గణనీయమైన రివార్డులను ప్రతిపాదించే నూతన క్రీడా విధానాన్ని ఆమోదించినట్లు తెలిపారు. జూనియర్, సబ్-జూనియర్ అథ్లెట్ల కోసం కూడా ఈ విధానంలో ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నామని, ప్రతిభావంతుల విజయాలను గుర్తిస్తూ వేలల్లో బహుమతులు అందజేస్తామన్నారు. ఎస్‌జిఎఫ్ఏపీ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు, సహాయ కార్యదర్శి కేవీ రాధాకృష్ణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ అబ్జర్వర్ ప్రదీప్ యాదవ్, వీఎంసీ 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ కృష్ణా జిల్లా అండర్-19 కార్యదర్శి వి.రవికాంత, కృష్ణా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి డి దయాకర్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం జరిగిన పోటీల్లో ఏపీ, ఒడిశా, ఎంపీ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ జట్లు తొలి విజయాలు నమోదు చేశాయి.

హెచ్‌ఎంపీవీపై అప్రమత్తం

- ముందస్తు చర్యలకు సిద్ధం కావాలి : సీఎం చంద్రబాబు ఆదేశం
- రాష్ట్రానికి కొత్తగా వచ్చేవారిపై దృష్టి పెట్టి, పరీక్షలు నిర్వహించాలని సూచన
- వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పొరుగు రాష్ట్రమైన కర్నాటకలో హెచ్‌ఎంపీవీ (వైరస్) కేసులు వెలుగు చూడటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వైరస్ వ్యాప్తి పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతూనే, మరోపక్క వైద్య ఆరోగ్య శాఖ పూర్తి అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ కేసులు ఇప్పటివరకు ఒక్కటి కూడా నమోదు కాలేదని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. రాష్ట్రంలోకి కొత్తగా వచ్చి వెళ్లే వారిపై దృష్టి పెట్టాలని, ఎక్కడ అనుమానం ఉన్నా పూర్తిస్థాయి పరీక్షలు జరపాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. అలాగే, ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు విశాఖలో ఉన్న మంత్రి సత్యకుమార్ అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో దీనిపై సమీక్ష చేశారు. ఇప్పటికే కర్నాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కేసులు నమోదైనందున ఆయా రాష్ట్రాల్లో తీసుకుంటున్న చర్యల గురించి అక్కడి అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి తెలుసుకోవాలని స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబుకు సూచించారు. అలాగే రాష్ట్రంలో ఉన్న 10 ఐసీఎంఆర్, 9 వీడీఆర్ పరీక్షా కేంద్రాలను సన్నద్ధం చేసుకోవాలని, అవసరాన్నిబట్టి టెస్టులకు కావాల్సిన కిట్లు, యాంటీ వైరల్ మందుల లభ్యతపై అంచనాలు తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలపై విధివిధానాలను రూపొందించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న తాజా పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు అందించాలని సూచించారు. ఏపీ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు, కార్యదర్శి డాక్టర్ మంజుల, కమిషనర్ వాకాటి కరుణ, ఏపీఎంఎస్ ఐడీసీ ఎండీ డాక్టర్ ఎ.సిరి, డీఎంఈ డాక్టర్ నరసింహం, డీహెచ్ డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై స్పష్టత ఇవ్వాల్సిందే

మోదీ పర్యటనకు నిరసనగా ఆందోళనలు

పోరాట కమిటీ, వామపక్షాల సమాయత్తం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు సమకూర్చడంపై ప్రధాని నరేంద్రమోదీ స్పష్టత ఇవ్వాలని, ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఈ నెల 8వ తేదీన ప్రధాని మోదీ విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పోరాట కమిటీ ఆందోళనకు సిద్ధమవుతోంది. దేశంలోని అన్ని భారీ స్టీల్‌ప్లాంట్‌లకు కేంద్ర ప్రభుత్వం చట్టప్రకారం సొంతగనులు కేటాయించింది. కానీ 35 ఏళ్ల నుండి ఉత్పత్తి చేస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు సమకూర్చలేదు. సొంత ఇనుప ఖనిజం గనులున్న ప్రతి స్టీల్‌ప్లాంట్‌కు ఇనుపఖనిజం తవ్వటానికి కేవలం టన్నుకు రూ. 600 మాత్రమే ఖర్చు అవుతోంది. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో టన్ను రూ.8000 లకు పైగా ఖర్చు పెట్టవలసి వస్తున్నదని ఉక్కు ఉద్యోగులు అంటున్నారు. దీనివలన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సాలీన రూ.3500 కోట్లు అదనంగా ఖర్చు అవుతున్నది. దీనిని నష్టంగా చూపించి కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టాలని కుట్ర చేస్తున్నది. నాలుగేళ్ల నుండి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నది. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై కక్షతో వ్యవహరిస్తున్నది. విశాఖ స్టీల్‌కార్మికులకు, అధికారులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం, ఉన్న జీతాన్ని తగ్గించి లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. జీతాలు రాకున్నా నవంబరు, డిసెంబరు నెలలో విశాఖ స్టీల్‌ప్లాంట్ నూరుశాతం ఉత్పత్తి సాధించింది. విశాఖ స్టీల్‌లో రెండు కన్వర్టర్ల ఉత్పత్తి 115 శాతం రికార్డు స్థాయిలో పెంచింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పోటీగా ఆర్సెలర్ మిత్తల్‌తో నక్కపల్లిలో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ పెట్టించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ఆర్సెలర్ మిత్తల్‌కు సొంత ఇనుప ఖనిజ గనులు కేటాయించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాలోచనలు చేస్తున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయడానికే ఆర్సెలర్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌ను నక్కపల్లిలో ఏర్పాటు చేస్తున్నారు. దక్షిణభారతదేశంలో నాణ్యమైన స్టీల్ అమ్మకాల్లో విశాఖ స్టీల్ అగ్రభాగాన ఉంది. ప్రధానమంత్రి మోదీ విశాఖపట్నం వస్తున్న సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌లో మరలా 4 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఏ స్టీల్‌ప్లాంట్‌లో లేని విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 55 ఏళ్లు దాటినవారందర్నీ తొలగించడానికి జాబితాలు సిద్ధం చేశారు. మరోవైపున ప్రతి కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న 30 శాతం మంది కార్మికులను తొలగించడానికి మరో జాబితా సిద్ధమైంది. మోదీ పర్యటన పూర్తికాగానే వీరందరినీ తొలగించాలని కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ నుండి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. మోదీ పర్యటన సందర్భంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని విశాఖ ఉక్కుపరిరక్షణ పోరాటకమిటీ నిర్ణయించింది. సోమవారం కూర్మన్నపాలెం జంక్షన్ నుండి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం విశాఖ స్టీల్ పోరాటానికి మద్దతుగా వామపక్షాలు జీవీఎంసీ గాంధీవిగ్రహం వద్ద, విశాఖ స్టీల్ శిబిరం వద్ద ధర్నా చేపట్టనున్నాయి.

మరింత క్షీణించిన దలేవాల్ ఆరోగ్యం

ఖనౌరీ సరిహద్దుకు సుప్రీంకోర్టు కమిటీ రాక

చండీగఢ్: పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని ఖనౌరీ వద్ద రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ ఆమరణ నిరాహారదీక్ష సోమవారానికి 42వ రోజుకు చేరుకుంది. 70 ఏళ్ల దలేవాల్ ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో ఆయన సారథ్యంలోని సంయుక్త కిసాన్ మోర్చా తీవ్ర ఆందోళన చెందుతోంది. కాగా శనివారం స్ట్రెచర్ పైనుంచే మహా పంచాయత్‌ను ఉద్దేశించి ఆయన 11 నిమిషాల పాటు ప్రసంగించారు. తిరిగి దీక్షా శిబిరంలోకి తీసుకెళ్లినప్పటి నుంచి ఆయన ఆరోగ్యం బాగా క్షీణిస్తోంది. ఆదివారం నాటికి దలేవాల్ మగతలో ఉన్నారని, వాంతులు చేసుకుంటున్నారని డాక్టర్ అవతార్ సింగ్ తెలిపారు. ఇక దలేవాల్ మూత్ర పిండాలు కూడా క్రమేపీ పని చేయలేని స్థితికి వస్తున్నట్లు గ్లోమెరులర్ ఫిల్ట్రేషన్ రేట్‌ను బట్టి తెలుస్తోందని అవతార్ సింగ్ చెప్పారు. ప్రస్తుతం ఆయన కనీసం మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారని ఎస్‌కేఎం నేతలు చెప్పుకొచ్చారు. తక్షణమే ఆయన దీక్ష విరమించినా కీలక అవయవాలు పూర్తి స్థాయిలో పని చేస్తాయన్న గ్యారెంటీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాగా రైతులతో చర్చలు ప్రారంభించేందుకు సుప్రీంకోర్టు నియమించిన హైపవర్ కమిటీ సోమవారం ఖనౌరీ సరిహద్దు సమీపంలోని ధాబి గుజ్రాన్‌కు చేరుకుంది. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ నేతృత్వంలో మాజీ డీజీపీ బీఎస్ సంధు, ఆర్థికవేత్త ఆర్‌ఎస్ ఘుమాన్, వ్యవసాయ నిపుణుడు దేవిందర్ శర్మ, పంజాబ్ రైతు కమిషన్ చైర్‌పర్సన్ సుఖ్‌పాల్ సింగ్‌తో కూడిన కమిటీ గత కొన్ని రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జగ్జిత్‌సింగ్ దలేవాల్‌ను కలుస్తోంది. కమిటీ సభ్యులతో సంభాషించాలని దలేవాల్ నిర్ణయించు కున్నారని, చర్చలు పొడిగిస్తే, అభిమన్యు కోహర్ వారితో సంభాషిస్తారని రైతు నాయకుడు కాకా సింగ్ తెలిపారు. డీఐజీ మన్‌దీప్ సింగ్ సిద్ధూ, మాజీ డీఐజీ నరేందర్ భార్గవ్‌లు రైతు నేతతో చర్చలు జరుపుతున్నారు. నిరసన తెలుపుతున్న రైతులతో చర్చలు జరపాలని పంజాబ్ ప్రభుత్వం కేంద్రాన్ని సంప్రదించిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది.సుప్రీం నియమించిన కమిటీ దలేవాల్‌ను కలిసి, వైద్య సహాయం తీసుకోవాలని కోరింది.కాగా శనివారం, పంజాబ్ వ్యవసాయ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుద్దియాన్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను జోక్యం చేసుకోవాలని, ఆందోళన చేస్తున్న రైతులతో చర్చించాలని కోరారు. ఇక దలేవాల్ ఆరోగ్యం క్షీణించిన క్రమంలో ఆదివారం సాయంత్రం, పాటియాలా సీని యర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నానక్ సింగ్, మాజీ డీఐజీ నరేందర్ భార్గవ్ రైతు నాయకులతో రహస్యంగా సమావేశమయ్యారు. ఖానౌరీ లో శనివారం రైతు సంఘాలు నిర్వహించిన మహాపంచాయత్‌లో 11 నిమిషాలపాటు ప్రసంగించిన అనంతరం దలేవాల్ ఆరోగ్యం క్షీణించిందన్న వార్తల నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులతో సహా దల్లేవాల్ అంతర్గత అవయవాలు ఒత్తిడికి గురవు తున్నాయని వైద్యులు తెలిపారు. ఘటనా స్థలంలో పోర్టబుల్ ఎకో కార్డియో గ్రఫీ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ మిషన్లు ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వైద్య సాయం అందించేందుకు పంజాబ్ సర్కార్ ముందుకు వచ్చినప్పటికీ దలేవాల్ తిరస్కరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.